శుక్రవారం
28-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 125
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

2లో
చైనా అంటార్కిటిక్ సాహసయాత్ర ప్రారంభం

బీజేపీ-ఆర్ఎస్ఎస్‌ను ఓడించాలి

- కార్పొరేట్-మతఫాసిస్టు శక్తులపై పోరు ఉధృతం
- కమ్యూనిస్టు-వామపక్ష ఐక్యత బలోపేతం
- 2025 నాటికి పది లక్షలకు పార్టీ సభ్యత్వం
- సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా పిలుపు

న్యూఢిల్లీ: దేశంలో లౌకికవాదానికి, ప్రజాస్వామ్యానికే కాకుండా రాజ్యాంగానికీ ముప్పుగా ఉన్న బీజేపీ-ఆర్ఎస్ఎస్ రెండింటినీ ఓడించడమే తక్షణ కర్తవ్యమని పార్టీ శ్రేణులకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. ఆ దిశగా ఉద్యమాలను తీవ్రతరం చేయాలని సూచించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఓటమితోనే దేశప్రజలను వినాశనం నుంచి కాపాడవచ్చు అని అన్నారు. ఇక్కడి పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్‌భవన్‌లో గురువారం రాజా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.సమావేశంలో పార్టీ కార్యదర్శులు వినయ్ విశ్వం, అమర్‌జీత్ కౌర్ పాల్గొన్నారు. ఈ నెల 14-18 తేదీలలో విజయవాడలో జరిగిన సీపీఐ 24వ జాతీయ మహాసభలలో చేసిన నిర్ణయాలు, ఆమోదించిన తీర్మానాలు, నూతన కమిటీ ఎన్నిక వివరాలను వెల్లడించారు. జీవనోపాధి, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, ఇల్లు, ఆహారం, స్థలం వంటి ప్రాథమికాంశాలను దృష్టి పెట్టుకోవడం ద్వారా పౌరులకు గౌరవ జీవితం, హక్కులకు హామీ ఇవ్వగలమన్నారు. మార్క్సిజం-లెనినిజం అమలు అవశ్యమని, దోపిడీ, కుల వ్యవస్థ నిర్మూలన, పితృస్వామ్యానికి చెక్ పెట్టడం కోసం పోరాటాలను పార్టీ మరింత ఉధృతం చేయాలని రాజా పిలుపునిచ్చారు. 2025లో పార్టీ శతాబ్ది ఉత్సావాలు జరుపుకోనున్నదని ఆనాటికి పార్టీ మరింత బలోపేతం కావాలని, పది లక్షల సభ్యత్వాన్ని కలిగివుండాలని; పార్లమెంటుతో పాటు రాష్ట్ర శాసనసభలు, స్థానిక సంస్థల్లో సముచిత ప్రాతినిధ్యం ఉండాలన్నారు. వామపక్ష ఐక్యత-కమ్యూనిస్టు ఐక్యత బలోపేతానికి మహాసభలు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. కార్పొరేట్-మతఫాసిస్టు శక్తులపై పోరాటానికి కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత కీలకమని చెప్పారు. సిద్ధాంతాలు ఆధారంగా కమ్యూనిస్టు ఉద్యమం ఏకీకరణను సీపీఐ జాతీయ మహాసభ పునరుద్ఘాటించినట్లు తెలిపారు.

దేశాన్ని అగాథంలోకి నెట్టివేసేలా వినాశకర విధానాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ఆర్థిక వ్యవస్థ పతనం అంచునకు చేరుకున్నదని, రూపాయి మారక విలువతో పాటు దేశ ప్రతిష్ఠ దిగజారుతోందని, నిరుద్యోగం తారాస్థాయికి చేరుకోవడంతో యువతలో అసహనం పెరిగిందని, ప్రపంచ ఆకలి సూచీలో స్థానం సిగ్గుచేటు అని అన్నారు.

ద్రవ్యోల్బణం దూసుకెళుతోందని, దేశ సంపద, ఆస్తులను కార్పొరేట్లతో పాటు బడా వ్యాపార సంస్థలు దోచుకుంటున్నాయని, ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యం, పీఎస్‌యూల ప్రైవేటీకరణ కోసం కేంద్రం పట్టుదలగా ఉన్నదని విమర్శించారు. లౌకిక, సంక్షేమ, సమాఖ్య దేశంగా భారత్‌కున్న గుర్తింపును రద్దు చేసేలా బీజేపీ-ఆర్ఎస్ఎస్ దూకుడు ప్రదర్శిస్తున్నాయన్నారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దురాగతాలు పేట్రేగిపోతున్నాయని, పౌరుల ప్రజాస్వామిక, రాజ్యాంగబద్ధ హక్కుల హరణ కొనసాగుతోందని, కార్పొరేట్-మతఫాసిజం ఆవిర్భావానికి సాక్షిగా దేశం నిలిచిందని రాజా ఆందోళన వ్యక్తంచేశారు.

మోదీ పాలనలో దళితులపై అక్కృత్యాలు అధికం

- యూపీఏ-2 హయాంతో పోలిస్తే రెట్టింపు
- బీజేపీ పాలిత యూపీ, మధ్యప్రదేశ్‌లో దాష్టీకాలు
- బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల్లోనూ వివక్షే

న్యూఢిల్లీ : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై అక్కృత్యాలు పెరిగిపోతున్నాయి. యూపీఏ హయాంలో దళితులపై జరిగిన దాడుల కంటే ఎనిమిదేళ్ల మోదీ పాలనలో ఆ సంఖ్య రెట్టింపునకు చేరింది. గడచిన వారం రోజుల వ్యవధిలో జరిగిన మూడు ఘటనలు ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాష్టీకానికి అద్దం పడుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో సోమవారం ఓ దళిత యువకుడి కళ్లు పీకేసి అతడిని దారుణంగా దుండగులు హత్య చేశారు. రోజైనా గడవకముందే తన భార్యను చూస్తున్నాడన్న ఆరోపణతో దళిత యువకుడిని, అతడి తల్లిదండ్రులను మధ్యప్రదేశ్‌లో మంగళవారం ఓ వ్యక్తి కాల్చిచంపాడు. టాయిలెట్ సీటు దొంగిలించాడని దళిత యువకుడికి గుండు గీసి, సిరా పూసి, స్తంభానికి కట్టేసి బీజేపీ నేత కొట్టిన హృదయవిదారక ఘటన ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. ఈ అక్కృత్యాలన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై జరుగుతున్న దాడులు, ఆ సామాజిక వర్గంపై కొనసాగుతున్న వివక్షను ప్రతిబింబిస్తున్నాయి. యూపీఏ-2 హయాంలో దళితులపై దేశవ్యాప్తంగా 1,73,088 దాడులు జరిగితే, మోదీ ఎనిమిదేళ్ల పాలనలో ఈ సంఖ్య 3,53,389కి అంటే సుమారుగా రెట్టింపు పెరిగింది. ఎస్సీలపై జరుగుతున్న దాడుల్లో అత్యధిక కేసులు యూపీలో నమోదవుతుండగా, ఎస్టీలపై దాడుల కేసుల్లో

- మిగతా 2 లో

విద్యుదుత్పత్తిలో మరో ముందడుగు

ఏపీ జెన్‌కో మూడో యూనిట్ ప్రారంభ సభలో సీఎం జగన్

8లో

ఉత్కంఠపోరులో చతికిలపడ్డ పాక్

జింబాబ్వే చేతిలో ఘోర పరాజయం

8లో

ఫిబ్రవరిలో గగన్‌యాన్ తొలి ప్రయోగం

ఇస్రో

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గగన్‌యాన్ తొలి ప్రయోగం జరుగుతుందని ఇస్రో తెలిపింది. ఒకదాని తర్వాత ఒకటిగా పరీక్షలను క్రమంగా నిర్వహిస్తామని భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) సీనియర్ అధికారి గురువారం తెలిపారు. చినూక్ హెలికాప్టర్, సీ-17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానాన్ని క్రూ మాడ్యూల్ పరీక్షల్లో వాడాలని భావిస్తున్నట్లు ఇస్రో హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్ ఆర్.ఉమామహేశ్వరన్ అన్నారు. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఈ క్రూ మాడ్యుల్‌లోనే వ్యోమగాములను మూడు రోజులు అంతరిక్షంలో గడుపుతారని తెలిపారు. భారతీయ అంతరిక్ష సదస్సులో ఉమామహేశ్వరన్ మాట్లాడారు. భూమి చుట్టూ తిరిగే క్రమంలో క్రూ సర్వీస్ మాడ్యూల్‌లో వ్యోమగాములకు అనుకూలమైన జీవావరణం ఉండేలా వాతావరణ నియంత్రణ వ్యవస్థ డిజైన్‌ను ఇస్రో పూర్తి చేసిందన్నారు. వచ్చే ఏడాది డిసెంబరులో మానవరహిత అంతరిక్ష నౌకాయానానికి ముందు 17 వేర్వేరు పరీక్షలను నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధమైనట్లు తెలిపారు. 2022లో గగన్‌యాన్ మిషన్‌ను చేపడతామని 2018, ఆగస్టు 15న ఎర్రకోటపై నుంచి మోదీ ప్రకటించారుగానీ కోవిడ్ కారణంగా మిషన్ ఆలశ్యమైంది. 2024 చివరిలో లేదా 2025 ఆరంభంలో భారతీయ వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. స్పేస్ కాప్స్యూల్ బయట ఉష్ణోగ్రత 2000 డిగ్రీల సెల్సియస్‌కుపైగా నమోదయ్యే అవకాశముంది. కాబట్టి వ్యోమగాములకు అనుకూలమైన పరిస్థితులు, ఉష్ణోగ్రత ఉండేలా క్రూ మాడ్యూల్, వాతావరణ నియంత్రణ వ్యవస్థ తయారీ జరుగుతోంది. ఇది

- మిగతా 2 లో

రేపు ఈశాన్య రుతుపవనాల ఆగమనం

తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈశాన్య రుతుపవనాలు ఆగమనానికి సూచికగా ఈనెల 29వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారతీయ వాతావరణ కేంద్రం (ఐఎండీ) పేర్కొంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అది తీవ్రరూపం దాల్చితే ఏపీలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల వల్ల దేశమంతటా వర్షాలు కురిస్తే, ఈశాన్య

- మిగతా 2 లో

సంతలో పశువుల్లాగా ఎమ్మెల్యేల కొనుగోలా?

- బీజేపీ వైఖరి సిగ్గుచేటు
- పవన్ కల్యాణ్ ఎన్డీఏ నుంచి బయటకు రావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణలో నలుగురు ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేసేందుకు బీజేపీ వందల కోట్ల రూపాయలు ఆఫర్ చేయటం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలపై మాట్లాడే పవన్ కల్యాణ్ ఇప్పటికైనా ఎన్డీఏ నుంచి బయటకు రావాలన్నారు. తెలంగాణలో ఎమ్మెల్యేలను సంతలో పశువుల మాదిరిగా కొనేందుకు బీజేపీ వందల కోట్ల రూపాయల ఆఫర్ చేసి పోలీసులకు దొరికిపోయిందన్నారు. మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక మొత్తం రూ.18వేల కోట్ల కాంట్రాక్ట్‌పై జరుగుతోందని, గతంలో వివిధ రాష్ట్రాల్లో మెజార్టీ లేకపోయినా ప్రత్యర్థి పార్టీల ప్రజా ప్రతినిధులను బెదిరించడం, బ్లాక్ మెయిల్ చేయటం, డబ్బుతో కొనుగోలు చేయటం వంటి అనైతిక పనులు చేసిన బీజేపీ అధికార పీఠాలు అడ్డదారుల్లో దక్కించుకున్నదని గుర్తుచేశారు. ఇప్పుడు తెలంగాణలో చిచ్చుపెట్టేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని, బీజేపీ వద్ద లక్షల కోట్ల రూపాయల అక్రమ ధనం ఉన్నందున, విచ్చలవిడిగా ఎమ్మెల్యేల కొనుగోలుకు ఖర్చుచేస్తోందని విమర్శించారు. ఒక్కొక్క ఎమ్మెల్యేకు వందల కోట్లు వెచ్చిస్తోందన్నారు. బీజేపీకి చెందిన కేంద్రంలోని పెద్దాయన కనుసన్నల్లోనే ఈ అక్రమ వ్యవహారం జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. బీజేపీ మతవాద, కుయుక్త, బ్లాక్ మెయిల్ రాజకీయాలను ప్రజాతంత్ర వాదులంతా ఖండించాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. బీజేపీ అనైతిక వ్యవహార శైలిపై హైదరాబాదులోనే ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించాలని, రాజకీయాల్లో నైతిక విలువలపై మాట్లాడే ఆయన ఇప్పటికైనా ఎన్డీఏ నుంచి బయటకు రావాలని రామకృష్ణ సూచించారు.

సాగునీటికి రైతుల అగచాట్లు

- మోకా వద్ద ఆయకట్టు రైతుల ఆందోళన
- పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన

విశాలాంధ్ర-హోలాగుంద: ఎల్ఎల్‌సీ కాలువకు నీటిని నిలుపుదల చేయడంతో సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే నీటిని విడుదల చేయాలని కోరుతూ ఆయకట్టు రైతులు గురువారం మోకా వద్ద ఆందోళన చేపట్టారు. బళ్లారి జిల్లాలోని మోకా వద్ద వేదవతి నదిపై ఏర్పాటు చేసిన 56 పిల్లర్లలో 16వ నెంబర్ పిల్లర్ కూలిపోయింది. కాలువకు పెద్ద ప్రమాదం జరగవచ్చన్న సమాచారంతో అధికారులు నీటి సరఫరాను పూర్తిగా నిలిపి వేశారు. దీంతో చేతికందివచ్చిన పంట సాగునీరు లేక దెబ్బతింటుందని ఆయకట్టు రైతులు గగ్గోలు పెడుతున్నారు. కాలువ కింద వరి, పొద్దు తిరుగుడు పంటలను సాగుచేశామనీ, పొట్ట దశకు చేరుకోవడంతో సరైన సమయంలో నీరు అందాల్సి ఉండగా, సరఫరా నిలిపివేయడంతో పంటపొలాలు దెబ్బతిని దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లర్ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని, కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, 184 కిలోమీటర్ వద్ద కాలువకు అడ్డుకట్ట వేసి నిల్వ ఉన్న కొద్దిపాటి నీరును మోటార్ల ద్వారా పొలాలకు మళ్లించుకుంటున్నట్టు

- మిగతా 2 లో

భద్రతాధికారులు, సిబ్బంది వేధింపులపై తిరుమలలో క్షురకుల నిరసన

2లో

ఇదీ లోకం!

ఏం జనాన్ని బతకనివ్వరా? ఆ!?

రాజ్యాంగబద్ధ పదవికి కళంకం

కేరళ గవర్నర్‌పై కాంగ్రెస్ ఘాటు విమర్శ

తిరువనంతపురం: రాజ్యాంగబద్ధ పదవికి తలవంపులు తెచ్చిపెట్టేలా కేరళ గవర్నర్ తీరు ఉన్నదని కాంగ్రెస్ గురువారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ గవర్నర్ పదవికి కళంకం అంటూ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వానికి, రాజ్‌భవన్‌కు మధ్య కొనసాగుతున్న వివాదం గతంలో జరిగినట్లు షాడో బాక్సింగ్గేనా అంటూ సందేహాన్ని వ్యక్తంచేసింది. ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్‌పై రాజ్యాంగబద్ధ చర్యలు తీసుకోవాలని గవర్నర్ లేఖ పంపగా అందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు నిరాకరించారు. ఇది వివాదానికి తెరతీసింది. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించింది. 'కేరళ గవర్నర్ అన్ని పార్టీలకు చెందిన వారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీల్లో పనిచేశారు. మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో జరిగినట్లుగానే ఈయన కూడా రాజ్యాంగబద్ధ పదవికి కళంకంగా మారారు' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. అనేక అంశాలపై ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య గొడవ కల్పితమని, ప్రజలను మభ్యపెట్టేందుకే అని రాష్ట్ర కాంగ్రెస్ విమర్శించడం విదితమే.

పేదల ఇళ్ల నిర్మాణంలో వైసీపీ దగా

నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల విషయంలో పెద్ద మోసం చేస్తోందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. మూడున్నరేళ్లలో ఎన్ని ఇళ్లు నిర్మించి పేదలకు ఇచ్చారో చెప్పాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండుచేశారు. ఇప్పటివరకు ఎనిమిది శాతం ఇళ్లు మాత్రమే పూర్తి చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో మంజూరైన ఇళ్లలో కేవలం ఐదు మాత్రమే నిర్మించడం చూస్తే వైసీపీ పాలన ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,63,562 ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించారు. మూడున్నరేళ్లలో కేవలం 1,52,325 ఇళ్లు పూర్తి చేశారు. అంటే 8 శాతం మాత్రమే. దాదాపు 80 శాతం ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రతి ఏడాది రూ. 4 వేల నుంచి రూ.5 వేల కోట్లు రాష్ట్రానికి కేటాయిస్తుంటే... ఆ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లిస్తోంది. ఈ ఏడాదిలోనే రూ.1,547 కోట్ల గృహ నిర్మాణ నిధులు దారి మళ్లించింది. కేంద్ర ప్రభుత్వం ఈ మూడేళ్లలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రూ. 22,737 కోట్లు విడుదల చేస్తే అందులో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది రూ.4915 కోట్లు మాత్రమే. 1.19 లక్షల టిడ్కో ఇళ్లు నిర్మాణం పూర్తయి గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నప్పటికీ అవి లబ్ధిదారులకు అందించలేదు. సంబంధిత శాఖ మంత్రి కూడా కల్లబొల్లి కబుర్లతో, అర్థం లేని విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో గృహ నిర్మాణంపై ప్రజా క్షేత్రంలోనే వైసీపీని ఎండగడతాం' అని మనోహర్ పేర్కొన్నారు.

ఏపీ ప్రభుత్వ సలహాదారుగా అలీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రముఖ సినీ నటుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత అలీని ఎట్టకేలకు ప్రభుత్వ పదవి వరించింది. ఆయనను ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అలీ రెండేళ్ల పాటు ప్రభుత్వ సలహాదారు (ఎలక్ట్రానిక్ మీడియా) పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీతభత్యాలు, అలవెన్సులకు సంబంధించి విడిగా ఉత్తర్వులు జారీ చేస్తామని జీవో తెలిపింది. ప్రభుత్వ సలహాదారులకు రూ.3లక్షల వరకు వేతనం, అదనంగా కొన్ని అలవెన్సులు అందుతాయి. వైసీపీ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిన వారందరికీ ఏదో ఒక పదవిని సీఎం జగన్ కట్టబెడుతున్నారు. దీనిలో భాగంగానే సినీరంగం నుంచి ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్న సినీనటుడు పృథ్వీరాజ్‌కు తిరుమల తిరుపతి దేవస్థానంకు చెందిన ఛానెల్‌కు చైర్మన్‌గా నియమించారు. ఆయన వివాదంలో చిక్కుకోవడంతో పదవి నుంచి తొలగించారు. పోసాని కృష్ణమురళి, అలీ కూడా జగన్ గెలుపుకు తీవ్రంగా కృషి చేశారు. ఈ నేపథ్యంలో మైనార్టీ కోటాలో అలీకి రాజ్యసభ అభ్యర్థిత్వం దక్కే అవకాశం ఉన్నట్లు విస్తృత ప్రచారం జరిగింది. దానితర్వాత కూడా ఏదో ఒక కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమితులయ్యే అవకాశాలున్నట్లు వార్తలొచ్చాయి. మొత్తానికి మూడున్నరేళ్లుగా పదవి కోసం పడిగాపులు కాస్తున్న అలీకి ఎట్టకేలకు ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అనే పదవి దక్కింది.

అటవీశాఖలో మెరుగైన ఫలితాలు

ముఖ్యకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అటవీశాఖలో మెరుగైన ఫలితాల సాధనకు పరిపాలన వికేంద్రీకరణ ఎంతో తోడ్పాటునిచ్చిందని, అందుకు అనుగుణంగా పూర్తి స్థాయిలో జిల్లాల పెంపునకు అనుగుణంగా వికేంద్రీకరణ చేపట్టామని అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. విజయవాడలో గురువారం రాష్ట్ర స్థాయి అటవీశాఖ అధికారుల రెండు రోజుల సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నీరబ్‌కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ, అటవీ శాఖ సిబ్బంది సక్రమంగా పనిచేయడానికి. అటవీ సంపదను కాపాడటానికీ, గ్రీన్ కవర్‌ను పెంచడానికి ఇది చాలా మంచి అవకాశమన్నారు. పూర్తి స్థాయిలో పర్యావరణ పరిరక్షణ చేపడితే, వాతావరణంలో అనుకూల మార్పులు జరిగి సకాలంలో వర్షాలు పడతాయని చెప్పారు. వీలైనన్ని చోట్ల మొక్కలను పెంచడం ద్వారా ఆక్సిజన్ శాతం పెరుగుతుందని చెప్పారు. అటవీ శాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి వై.మధుసూదన రెడ్డి మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్మాణాత్మకంగా పనిచేసి మంచి ఫలితాలు రాబట్టాలని పిలుపునిచ్చారు. అటవీశాఖకు కొత్త రూపం తీసుకురావడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అడవుల విషయంలో ప్రజలకున్న అపోహలను తొలగించి ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న అడవులలో నగర వనాలు ఏర్పాటు చేసి అక్కడ అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. క్షీణించిన అడవుల పునరుద్ధరణ లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. .

బ్రిటన్ బడ్జెట్ ప్రణాళిక వాయిదా

లండన్: వచ్చేవారం ప్రకటిస్తారని ఆతృతగా ఎదురుచూస్తున్న బడ్జెట్ ప్రణాళికను యువ బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ వాయిదా వేశారు. బ్రిటన్‌లో కొన్ని వారాలుగా నెలకొన్న రాజకీయ గందరగోళం నివారణ పనిలో రిషి నిమఘ్నమయ్యారు. ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకుడు కీర్ స్టార్మర్ ఆకస్మిక సార్వత్రిక ఎన్నికలకు డిమాండ్ చేస్తున్నాడు. ఎన్నికలకు ఇంకా రెండేళ్లు గడువు ఉన్నందున ముందుగా సార్వత్రిక ఎన్నికల డిమాండ్‌ను రిషి తోసిపుచ్చారు. "ఆర్థిక స్థిరత్వం, విశ్వాస పునరుద్దరణకు కఠినమైన నిర్ణయాలను మేము తీసుకోవలసి ఉంది' అని పార్లమెంటులో తన మొదటి 'ప్రధానమంత్రి ప్రశ్నలు' కార్యక్రమంలో రిషి ఎంపీలకు చెప్పారు. కొన్ని వారాలలో తన ఆర్థికమంత్రి జెరెమీ హంట్ వివరణాత్మక బడ్జెట్ ప్రణాళిక రూపొందిస్తారని కూడా రిషి చెప్పారు. 'కోవిడ్-19 మహమ్మారి సందర్భంగా మేము చేసిన విధంగా అత్యంత దుర్బలమైన వాటిని ఎల్లప్పుడూ రక్షిస్తాము, సక్రమ మార్గంలో దీన్ని చేస్తాము" అని మాత్రం నేను చెప్పగలనని రిషి అన్నారు.

గత వేసవికాలంలో జరిగిన నాయకత్వ ఎన్నికల్లో లిజ్ ట్రస్ ఓడించిన తరువాత రిషి సునాక్‌కు చట్టబద్ధత కొరవడిందని, అందుచేత సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌ను స్టార్మర్ వల్లెవేశారు. సార్వత్రిక ఎన్నికలకు పిలుపివ్వాలని ప్రతిపక్ష సభ్యుల హర్షధ్వానాల మధ్య స్టార్మర్ డిమాండ్ చేశారు. 'ఇప్పుడు నూతన ప్రధానమంత్రి ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత దీర్ఘకాలిక స్థిరత్వం అవకాశాలు ఉన్నాయి' అని హంట్ అన్నారు. నూతన బడ్జెట్ ప్రణాళిక తాజా ఆర్థిక దూరదృష్టితో కూడినదిగా ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. బడ్జెట్ ప్రణాళిక జాప్యం గురించి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాడ్ గవర్నర్ ఆండ్రూ బెయిలీతో చర్చించినట్లు హంట్ చెప్పారు. ట్రస్ విఫల పన్నులకోత ప్రణాళికల తరువాత ఇటీవల వారాల్లో సెంట్రల్ బ్యాంక్ అత్యవసర జోక్యాలు చేసుకోవలసి వచ్చింది.

బ్రిటీష్ తనఖాదారులు, వాణిజ్య వర్గాలకు మరింత హామీ ఇవ్వడానికి బడ్జెట్ ప్రణాళిక జాప్యం 'పరీక్షా సమయంలో నిలబడుతుంది' అని హంట్ అన్నారు. మంత్రివర్గ ఉన్నత బృందాన్ని మంగళవారం నియమించిన అనంతరం రష్యాకి వ్యతిరేకంగా కీవ్‌కు ప్రస్తుత మద్దతు కొనసాగింపుతో సహా బ్రిటన్ విదేశాంగ విధానం కొనసాగింపు ఉంటుందని ప్రతిన చేస్తూ ఉక్రెయిన్, అమెరికా అధ్యక్షులతో రిషి సునాక్ మాట్లాడారు.

చైనా అంటార్కిటిక్ సాహసయాత్ర ప్రారంభం

షాంఘై: దేశ 39వ అంటార్కిటిక్ యాత్ర ప్రారంభ సూచకంగా చైనా పరిశోధనాత్మక ఐస్‌బ్రేకర్ (మంచు పలకలను ఛేదించే) గ్జులాంగ్-2 లేదా స్నో డ్రాగన్-2 నౌక షాంఘై సముద్రతీరం నుండి బుధవారం బయలుదేరింది. ఈ నౌకలో మొత్తం 255 మంది పరిశోధకులు రెండు బ్యాచ్‌లుగా వాతావరణ పొందిక, జల పర్యావరణం, అవక్షేపాల పర్యావరణం, దక్షిణ ధృవంలో పర్యావరణ వ్యవస్థ రంగాలలో పరిశోధనలు జరుపుతారు. ఈ సాహసయాత్ర బృందం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో చైనా తిరిగి వస్తుందని భావిస్తున్నారు.

ధృవాల పరిశోధన కొరకు 122 మీటర్ల పొడవు, 22 మీటర్ల వెడల్పు, దాదాపు 14 వేల టన్నుల బరువు మోయగల సామర్థ్యం, 20 వేల నాటికల్ మైళ్ల సహనశక్తితో గల గ్జులాంగ్-2 చైనా మొదటిసారిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించింది. తూర్పు చైనాలోని షాంఘై నుండి ఈనెల 26న గ్జులాంగ్ అంటార్కిటిక్ సాహసయాత్ర ప్రారంభమైన వెంటనే నౌకలోని చైనా పరిశోధకులు గుడ్‌బై చెప్పారు.

ప్రపంచ ఉద్గారాలు 2025లో తారస్థాయికి

పారిస్: ప్రపంచ ఉద్గారాలు 2025లో తారస్థాయికి పెరుగుతాయని గురువారం విడుదల చేసిన "ప్రపంచ ఇంధన దృక్పథం 2022" నివేదికలో అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) వెల్లడించింది. తాజా ఇంధన సమాచారం, మార్కెట్ పరిణామాల ఆధారంగా ఈ ఏడాది డబ్ల్యుఇఓ (వరల్డ్ ఎనర్జీ ఔట్‌లుక్) స్వచ్ఛ ఇంధన సంధికాలాలకు అవరోధాలు, ఇంధన మార్కెట్లపై ప్రభుత్వ బాధ్యత, నికర జీరో ఉద్గారాల బాటపై ముందున్న ఇబ్బందులతో సహా సంక్షోభం గురించి కీలక ప్రశ్నలను అన్వేషించింది. ప్రపంచ ఉద్గారాలు 2025లో తారస్థాయికి చేరి, 2030లో 31.5 స్థాయికి పడిపోతాయని, ఇది ఎస్‌టీఈపీఎస్‌లో కన్నా దాదాపు 15 శాతం తక్కువని నివేదిక పేర్కొంది.

శిలాజ ఇంధనాల కొరకు ప్రపంచ వ్యాపిత డిమాండ్ నిక్కచ్చిగా తారస్థాయికి చేరగలదని చూడగల ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న విధాన దృశ్యాల ఆధారంగా ఐఈఏ దృక్పథ నివేదిక రూపొందించింది. 'రానున్న కొన్ని సంవత్సరాల్లో బొగ్గు డిమాండ్ తారస్థాయికి పెరుగుతుంది. ఈ దశాబ్దం చివరికి సహజవాయువు విశాల భూభాగానికి చేరుతుంది. 2030 మధ్య కాలం నాటికి చమురు డిమాండ్ ఉన్నత సూచీకి ఎగబాకుతుంది' అని నివేదిక పేర్కొంది. ఉక్రెయిన్ సంఘర్షణతో రగిలిన ప్రపంచ ఇంధన సంక్షోభం తీవ్ర పర్యావసానాలు మొత్తం ఆర్థిక వ్యవస్థలపై ఉంటాయని, ప్రభుత్వాల నుండి స్వల్పకాలిక ప్రతిస్పందన ఉంటుందని, ఇంధన భద్రతను పెంపొందించడానికి లోతైన చర్చ జరుగుతుందని ప్రపంచ ఇంధన దృక్పథం (డబ్ల్యూఈఓ) నివేదిక వెల్లడించింది.

ఏ క్షణంలోనైనా బాంబు పేలవచ్చు

రెండవ అభిప్రాయాన్నీ కోరా...

ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కేసులో జార్ఖండ్ గవర్నర్

రాయ్‌పూర్: జార్ఖండ్‌లో ఏ క్షణంలోనైనా అణు బాంబు పేలవచ్చు అని ఆ రాష్ట్ర గవర్నర్ రమేశ్ బైస్ వ్యాఖ్యానించారు. రాజకీయ సంక్షోభానికి దారితీసిన ఆఫీస్-ఆఫ్-ప్రాఫిట్ (లాభదాయక పదవి) కేసుకు సంబంధించి తన నిర్ణయం పెండింగ్‌లో ఉండటాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో రెండవ అభిప్రాయాన్నీ కోరినట్లు తెలిపారు. దీపావళి కోసం స్వస్థలానికి వెళ్లిన ఆయన అక్కడ ఓ వార్తాఛానల్‌తో మాట్లాడారు. ఆఫీస్-ఆఫ్- ప్రాఫిట్ కేసు క్రమంలో సోరెన్‌పై అనర్హత వేటు కోసం బీజేపీ పిటిషన్‌పై తమ నిర్ణయాన్ని ఎన్నికల కమిషన్ ఆగస్టు 25న గవర్నర్‌కు పంపింది. ఆపై రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించకపోయినా మైనింగ్ లీజుతో సంబంధమున్నదన్న ఆరోపణల క్రమంలో ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రిపై అనర్హత వేటుకు ఈసీ సిఫార్సు చేసినట్లు సమాచారం. అయితే, జార్ఖండ్ ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కక్షసాధింపుకు పాల్పడుతున్నట్లు సోరెన్ కేబినెట్ సహచరులు చేస్తున్న ఆరోపణలపై గవర్నర్ స్పందించారు. 'నిజంగా నా ఉద్దేశం అదే అయితే ఎన్నికల కమిషన్ సిఫార్సు ఆధారంగా నిర్ణయాన్ని తీసుకొని ఉండేవాడిని.. కానీ ఎవరినీ అప్రతిష్ఠపాల్జేసే చర్యలు తీసుకోవాలని అనుకోలేదు. కక్షసాధింపు లేదు' అని రమేశ్ బైస్ అన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండి క్షక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు తనపై ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. ఈ వ్యవహారంలో రెండవ అభిప్రాయాన్ని కోరినట్లు తెలిపారు. ఈసీ ఏమని సిఫార్సు చేసింది... ఎవరి నుంచి రెండవ అభిప్రాయాన్ని కోరారన్న వివరాలను ఆయన వెల్లడించలేదు. రెండవ అభిప్రాయాన్ని పొందాక నిర్ణయాన్ని వెల్లడిస్తారా అన్న ప్రశ్నకు 'బాణాసంచా పేలుళ్లు దిల్లీలో నిషిద్ధం.. జార్ఖండ్‌లో కాదు. ఇక్కడ ఒక

అణుబాంబు పేలవచ్చేమో!' అని ఆయన చమత్కరించారు. ఇదిలావుంటే, ఇది తనకు సంబంధించిన అసాధారణ కేసు అని అక్టోబరు 15న సీఎం సోరెన్ వ్యాఖ్యానించారు. నేరస్తుడు/నిందితుడు శిక్షను కోరుతుంటే తీర్పు చెప్పాల్సిన రాజ్యంబద్ధ యంత్రాంగం మౌనంగా ఉందని తనపై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలన్న ఈసీ సిఫార్సులనుద్దేశించి అన్నారు. సోరెన్ ప్రభుత్వం గతనెలలో బలపరీక్షలో నెగ్గిన విషయం విదితమే.

అకృత్యాలు అధికం

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టింది మొదలు... దళితులపై జరుగుతున్న దాడులు అంతకంతకూ పెరుగుతున్నట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) గణాంకాలను పరిశీలిస్తే అర్థమవుతోంది. కేసుల పరిష్కారంలోను, నిందితులను శిక్షించడంలోనూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దేశ జనాభాలో 30 శాతానికి పైగా ఉన్న దళితులకు ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు 3 శాతం మాత్రమే. దీన్ని బట్టి దళితులపై బీజేపీకి ఉన్న ప్రేమ ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.

ఫిబ్రవరిలో గగన్‌యాన్ తొలి ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

సవాళ్లభరితంగా సాగుతోంది. వ్యోమగాములు కూర్చొనే, ఎగిరేందుకు ఏర్పాట్లు పూర్తి కాగా మరో ఆరు నెలల్లో క్రూ మాడ్యూల్ సిద్ధమవుతుందని ఉమామహేశ్వరన్ చెప్పారు. ప్రాణ వాయువు అందిస్తూ బొగ్గుపులుసు వాయువును బయటకు పొందుతూ, తేమ లేకుండా ఉష్ణోగ్రతలు తగిన విధంగా ఉంటూ అగ్ని ప్రమాదాలకు తావు ఇవ్వని క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో క్రూ మాడ్యుల్ రూపుదిద్దుకుంటున్నదని అన్నారు. వాతావరణ నియంత్రణ వ్యవస్థను దేశీయ పరిజ్ఞానంతో తయారు చేయాలని ముందే నిర్ణయించినట్లు తెలిపారు. 'మనకు సామర్థ్యం ఉన్నాగానీ తయారీ కాస్తంత ఎక్కువ సమయం పడుతోందని చెప్పారు. డిజైన్ మొత్తం పూర్తి అయిందని, ఇప్పుడు అది సురక్షితమని నిరూపించాల్సి ఉందని అన్నారు. నలుగురు వ్యోమగాములను ఎంపిక చేయగా వారికి రష్యాలో ప్రాథమిక శిక్షణ పూర్తి అయిందని, తదుపరి శిక్షణను బెంగళూరులోని వ్యోమగాముల శిక్షణ కేంద్రంలో వారు పొందుతున్నారని ఉమామహేశ్వరన్ తెలిపారు.

భద్రతాధికారులు, సిబ్బంది వేధింపులపై

తిరుమలలో క్షురకుల నిరసన

కల్యాణకట్ట వద్ద ధర్నా-విధుల బహిష్కరణ

తలనీలాలు సమర్పించేందుకు భక్తుల ఇక్కట్లు

విశాలాంధ్ర - తిరుమల : తమకు న్యాయం చేయాలని తిరుమలలోని కల్యాణ కట్టలలో పనిచేస్తున్న క్షురకులు గురువారం నిరసనకు దిగారు. టీటీడీ భద్రతాధికారులు, సిబ్బంది తమను వేధిస్తున్నారని క్షురకులు కల్యాణకట్ట వద్ద ధర్నా నిర్వహించారు. ఉదయం విధులకు హాజరు కావాల్సిన క్షురకులు తిరుమలలోని అన్ని కల్యాణకట్టల వద్ద ధర్నాకు దిగ్గారు. క్షురకులు కాసేపు విధులను బహిష్కరించారు. దీంతో తిరుమలలో తలనీలాలు సమర్పించేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీస్ రేట్ కాంట్రాక్టు క్షురకులు ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీటీడీ శాశ్వత క్షురకులు మాత్రమే విధులకు హాజరయ్యారు. అన్ని కల్యాణకట్టల వద్ద భక్తులు బారులు తీరారు. గత కొన్ని నెలలుగా టీటీడీ యాజమాన్యం తమను ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేరాలని వేధిస్తోందని అందుకు అంగీకరించకుండా తాము కోర్టును ఆశ్రయించామనీ, కల్యాణ కట్టలో ఉన్న లాకర్లను పగల కొట్టి తనిఖీలు

చేపట్టారని క్షురకులు మీడియాకు తెలిపారు. 12 ఏళ్లుగా పనిచేస్తున్న తమను వేధిస్తూ విజిలెన్స్ అధికారులు దొంగలుగా చిత్రీకరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఇబ్బందులకు గురిచేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సివస్తుందని క్షురకులు హెచ్చరించారు. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేరలేదని తమపై భక్తుల వద్ద నుంచి లంచాలు తీసుకుంటున్నారని అభియోగాలు మోపడం సరైన పద్ధతి కాదన్నారు. తాము కల్యాణ కట్టలో ప్రశాంతంగా పనిచేసుకొనేలా టీటీడీ అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

టీటీడీ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి : ఏఐటీయూసీ

టీటీడీ కల్యాణకట్టలో పనిచేసే నాయి బ్రాహ్మణ కార్మికులపై టీటీడీ యాజమాన్యం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ చేతివృత్తుదారుల సంఘం జిల్లా కార్యదర్శి డి.రామచంద్రయ్య ఒక ప్రకటనలో కోరారు. టీడీడీలో పనిచేసే పిస్ రేట్ నాయి బ్రాహ్మణ కార్మికులను వేధించడం మానుకోవాలని కనీస వేతనం రూ 26,000 ఇస్తూ బస్సు సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి వారు చేసే పోరాటానికి ఏఐటీయూసీ, చేతి వృత్తుదారుల సంఘం పూర్తి మద్దతునిస్తుందని రాధాకృష్ణ, రామచంద్రయ్య తెలిపారు.

సాగునీరుకు రైతుల అగచాట్లు

(మొదటిపేజీ తరువాయి)

రైతులు వీరప్ప, మహానంది, చినిగి సాబ్, బెళగల్ సాయి భేష్, రహంతుల్లా చెప్పారు. డీజిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లకు రోజుకు రూ.20 వేలు ఖర్చు పెట్టినా పంట పొలాలు సక్రమంగా నీరు అందడంలేదని వాపోయారు. కాల్వకు నీటిని విడుదల చేయకపోతే కోట్లాది రూపాయలు నష్టం భరించాల్సి వస్తోందని రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, బళ్లారి జిల్లా తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు పురుషోత్తం గౌడ్, తుంగభద్ర రైతు సంఘం నాయకుడు, టీడీపీ మండల కన్వీనర్ వీరన్న గౌడ్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

రేపు ఈశాన్య రుతుపవనాల ఆగమనం

(మొదటిపేజీ తరువాయి)

రుతుపవనాలు కేవలం దక్షిణ భారతంపైనే ప్రభావం చూపుతాయని పేర్కొంది. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు అంటే మూడు నెలల పాటు దక్షిణాదిన విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో కంటే ఈశాన్య రుతుపవనాల సమయంలోనే బంగాళాఖాతంలో ఎక్కువగా తుపానులు ఏర్పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడుపై ఎక్కువ ప్రభావం చూపుతుంటాయని తెలిపింది. సాధారణంగా ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో మూడు తుపాన్లు ఏర్పడుతుంటాయని, ఈసారి అంతకుమించి ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేశారు.

బీసీలకు జగన్ పెద్దపీట: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీసీలకు సామాజిక న్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని, బీసీలకు సీఎం పెద్దపీట వేశారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కొనియాడారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం బీసీల ఆత్మగౌరవ సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సజ్జల మాట్లాడుతూ, అన్ని పదవుల్లోనూ బీసీలకు సముచిత గౌరవిమచ్చామని, తద్వారా సామాజిక న్యాయం చేశామన్నారు. గత ప్రభుత్వం ఏ నాడూ బీసీలను పట్టించుకోలేదన్నారు. చాలా రాష్ట్రాల్లో ఏళ్లతరబడి బీసీలకు చెందిన అనేక మంది సీఎంలుగా పనిచేశారనీ, ఏ ఒక్కరూ బీసీలకు న్యాయం చేయలేదన్నారు. సీఎం జగన్ మాత్రమే బీసీల పక్షపాతిగా వాళ్ల తలరాతలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. జగన్ ఓ సామాజిక విప్లవకారుడని కొనియాడారు. జగన్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ ఫలాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ సభలో మంత్రులు సీదిరి అప్పలరాజు, విడదల రజని, ఉషశ్రీ చరణ్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వివిధ ప్రాంతాలకు చెందిన వైసీపీ బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

హైకోర్టుకు ఎమ్మెల్యేల బేరసారాలు

విశాలాంధ్ర- హైదరాబాద్: తెలంగాణలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు జరిగిన బేరసారాల వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. టీఆర్ఎస్, బీజేపీ నేతల పరస్పర ఆరోపణలు, విమర్శలతో రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. తాజాగా ఈ వ్యవహారంపై బీజేపీ హైకోర్టును ఆశ్రయించింది. కేసును సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఘటనపై సిట్‌ను నియమించాలని పిటిషన్‌లో కోరింది. పార్టీ మారితే డబ్బు, కాంట్రాక్టులు, పదవులు ఇస్తామంటూ టీఆర్ఎస్‌కు చెందిన అచ్చంపేట, పినపాక, కొల్లాపూర్, తాండూరు ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, రేగా కాంతారావు, హర్షవర్ధన్ రెడ్డి, రోహిత్ రెడ్డిలను కొందరు ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో రామచంద్రభారతి, సింహయాజి, నంద కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. మొయినాబాద్ సమీపంలోని ఫాంహౌస్ లో పట్టుబడిన ముగ్గురు నిందితులను ప్రశ్నిస్తున్నారు. వారిని రహస్య ప్రాంతాల్లో ఉంచి విచారిస్తున్నారు. బేరసారాల వెనుక ఎవరున్నారనే విషయంపై కూపీ లాగుతున్నట్లు సమాచారం. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను విశ్లేషిస్తున్నారు. వారి నుంచి వివరాలు సేకరించిన తర్వాత కోర్టులో హాజరుపరచనున్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కోసం ప్రలోభాలకు గురిచేయడం, బేరసారాలకు పాల్పడటంపై మొయినాబాద్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

ముగ్గురిపై కేసు

టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు జరిగిన బేరసారాల వ్యవహారంలో ముగ్గురిపై మొయినాబాద్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దిల్లీకి చెందిన సతీశ్ శర్మ అలియాస్ రామచంద్ర భారతి(ఏ1), హైదరాబాద్‌కు చెందిన నందకిశోర్ (ఏ2), తిరుపతికి చెందిన సింహయాజి (ఏ3)పై కేసు నమోదు కేసినట్లు రాజేంద్రనగర్ ఏసీపీ తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో కీలక అంశాలను పోలీసులు పొందుపర్చారు. బీజేపీలో చేరితే రూ.100 కోట్లు ఇప్పిస్తామని రోహిత్‌రెడ్డికి సతీష్ శర్మ అలియాస్ రామచంద్ర భారతీ ఆఫర్ చేశారని, నందకిశోర్ మధ్యవర్తిత్వంతో ఫామ్‌హౌస్‌కు సతీష్ శర్మ, సింహయాజి వచ్చారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. టీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరితే రూ.100 కోట్లు ఇస్తామని బీజేపీ తరపున వారు హామీ ఇచ్చినట్లు పైలట్ రోహిత్ రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. పార్టీలో చేరకపోతే ఈడీ, సీబీఐ కేసులు నమోదు చేస్తామని బెదిరించినట్లుగా ఆయన పేర్కొన్నట్లు ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు. బీజేపీలో చేరితే సెంట్రల్ సివిల్ కాంట్రాక్టులతోపాటు కేంద్ర ప్రభుత్వంలో ఉన్నత పదవులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారంటూ రోహిత్ రెడ్డి చెప్పిన విషయాన్ని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు.

సాగు-సాగుదారుని రక్షణకు

ఉద్యమించాల్సిందే

- రైతు సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయి కిసాన్ కమిషన్ అవశ్యం
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సదస్సులో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వ్యవసాయం-రైతు రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిందేనని వక్తలు అన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి జాతీయస్థాయిలో కిసాన్ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రముఖ పాత్రికేయులు, రామన్ మెగాసెసే అవార్డుగ్రహీత పాలగుమ్మి సాయినాథ్ డిమాండ్ చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న మోదీ ప్రభుత్వ వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. ఇందు కోసం రూపొందించిన కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం రైతుల ఆదాయం పెరగలేదు.. తగ్గిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో విజయవాడ మాకినేని విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ సంక్షోభం - పరిష్కార మార్గాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో సాయినాథ్ మాట్లాడారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు వచ్చి 18ఏళ్లు అయినా వాటిని బీజేపీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. దేశంలో అదానీ, అంబానీల సంపద పెరుగుతుంటే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కరోనా కాలంలో పేదలు ఆకలితో అలమటిస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు ఊడిగం చేసిందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా రైతులు చరిత్రాత్మక పోరాటం చేశారని, మోదీప్రభుత్వం మెడలు వంచి మూడు నల్ల సాగుచట్టాలను రద్దు చేయించారని గుర్తుచేశారు. రైతుల సమస్యలపై పార్లమెంటులో, అసెంబ్లీలో ఒకరోజు చర్చ జరగాలని రైతాంగం పోరాడుతుంటే పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం సీ20 ప్లస్ 50శాతం కలిపి మద్దతుల హామీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యల నివారణకు రుణ ఉపసమనం చట్టం తేవాలన్నారు. వ్యవసాయాన్ని, రైతులను రక్షించుకోవడం కోసం గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకు ఐక్యఉద్యమాలు చేపట్టాలని, కార్పొరేట్లను వ్యతిరేకించాలని సాయినాథ్ పిలుపునిచ్చారు.

మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ మోదీ హయాంలో లక్ష మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటే అన్నదాతకు రుణమాఫీ జరిగిన దాఖలాలు లేవని అన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు 11 లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసి రైతులకు చేయలేమని చెప్పడం దుర్మార్గమని అన్నారు. రైతు ఆదాయం పెరగాలంటే సాగు ఖర్చు తగ్గించాలని, రుణమాఫీ జరగాలని అన్నారు. ప్రతి రైతుకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, రుణభారం నుంచి ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులను ఆదుకోవడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదనీ, కనీసం ధాన్యానికి మద్దతుధర లేదన్నారు. కౌలు రైతులను ఆదుకునే విధానం లేదన్నారు.

కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, కౌలు రైతుల సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరి బాబు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మధు, రైతు సంఘం సీనియర్ నాయకులు కేశవరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం కార్యదర్శి పీవీ ఆంజనేయులు, గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జొన్న శివశంకర్, అజయ్ కుమార్, పల్నాడు జిల్లా సంఘం కార్యదర్శి ఎ.గోపాలరావు, కృష్ణాజిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, రాష్ట్ర చెరుకు రైతుల సంఘం అధ్యక్షులు గుండపనేని ఉమా వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్‌వీ శర్మ, నెల్లూరు జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఎం.వెంగయ్య, పశ్చిమగోదావరి జిల్లా రైతుసంఘం కార్యదర్శి ఎ.హరేరామ్, ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం నాయకులు ఎం శోభన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సదస్సుకు వ్యవసాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య స్వాగతం పలికారు.

మోడల్ స్కూల్ హాస్టళ్ల సిబ్బందికి

కనీస వేతనమివ్వాలి

ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 134ఏపీ మోడల్ స్కూళ్లకు అనుబంధంగా ఉన్న బాలికల వసతిగృహాల్లో ఔట్‌సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న వార్డెన్లు, వాచ్‌మేన్లకు కనీసం వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ ఏపీ నాయకులు రమేశ్‌బాబు, మునెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్, సమగ్ర శిక్ష కార్యదర్శి నాగమణిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ, విధులో చేరినప్పుడు ఉద్యోగ పట్టికలో సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు విధులు నిర్వహించాలని, పది రోజుల తర్వాత 24×7 పనిచేయాలని మరో ఉత్తర్వు జారీచేశారని గుర్తుచేశారు. దీంతో కుటుంబా లను వదిలి రాత్రీ, పగలు తేడా లేకుండా 24 గంటలు విధుల్లో ఉంటూ సిబ్బంది మానసిక ఒత్తిడికి గురవుతున్నార న్నారు. ఆప్కాస్ పరిధి ఉద్యోగులు ఎనిమిది గంటలు పని చేసినా, 24 గంటలపాటు పనిచేసినా ఒక్కటే వేతనం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మోడల్ స్కూళ్లలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఉన్న ఫిజికల్ డైరెక్టర్లను ఒప్పంద విధానంలోకి మార్చి రూ.43వేల వేతనం ఇస్తున్నారని, అదే విభాగంలో డిగ్రీ, పీజీ అర్హత ఉన్న వార్డెన్లు తక్కువ వేతనంతో పనిచేస్తు న్నారు. వర్కర్లను ఎందుకు కాంట్రాక్టు విధానంలోకి మార్చడం లేదని నాయకులు ప్రశ్నించారు. వారికి పని ఒత్తిడి నుంచి విముక్తి కల్పించి వంట మనిషి, వాచ్‌మేన్ పోస్టులను పెంచాలనీ, బదిలీల ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్ట్‌టైమ్ ఉద్యోగులను అప్కాస్ పరిధిలోకి తేవాలన్నారు. విశాఖపట్నంలో మోడల్ హాస్టల్స్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సంవత్సర వేతనాలు విడుదల చేయాలని, పార్ట్ టైమ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరారు. దీనిపై కమిషనర్‌తోపాటు సమగ్ర శిక్ష కార్యదర్శి నాగమణి సానుకూలంగా స్పందించినట్ల తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రుక్సానా, నాగమణి, మౌనిక పాల్గొన్నారు.

అన్ని డిగ్రీ కళాశాలలో ఒకే ఫీజు విధానం

- ప్రత్యేక బృందాలతో తనిఖీలు
- సమర్థవంతంగా జగన్ విద్యాదీవెన అమలు
- ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటు
- ఏపీ హెచ్‌ఈఆర్‌ఎంసీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో ఒకే రకమైన ఫీజు విధానానికి శ్రీకారం చుట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ఉన్న విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఏపీ హెచ్‌ఈఆర్‌ఎంసీ) కార్యదర్శి డాక్టర్ ఎన్.రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన కమిషన్ చేపడుతున్న చర్యల్ని వివరిస్తూ రాష్ట్రంలో డిగ్రీ కోర్సులకు ఒకే ఫీజు విధానం తీసుకొచ్చామన్నారు. 2019-20 సంవత్సరానికి ముందు డిగ్రీ కోర్సులకు ఒక్కొక్క యూనివర్సిటీలో ఒక్కోరకమైన ఫీజు ఉండేదని గుర్తుచేశారు. ఈ ఫీజుల్లో వివిధ విశ్వవిద్యాలయాల మధ్య భారీ వ్యత్యాసం ఉండటం అనేక విమర్శలకు దారితీసిందన్నారు. ఉదాహరణకు బీఏ కోర్సులో ఒక విశ్వవిద్యాలయంలో అధికంగా రూ.15,440 ఫీజు ఉండగా, మరో విశ్వవిద్యాలయంలో కేవలం రూ.6,550 మాత్రమే ఉందని వివరించారు. బీకాం కోర్సులో ఒక యూనివర్సిటీలో రూ.18,320 ఫీజుండగా మరో విశ్వవిద్యాలయంలో అది కేవలం రూ.9350 ఉందని, బీఎస్సీ కోర్సులకు ఒక యూనివర్సిటీలో రూ.18,720 ఫీజుండగా మరో విశ్వవిద్యాలయంలో రూ.11వేలు మాత్రమే ఉందని వివరించారు. ఈ వ్యత్యాసాన్ని తొలగించి రాష్ట్రమంతా ఒకే ఫీజులు నిర్ణయించి ప్రభుత్వం అమలు చేసేలా ఉన్నత విద్యా కమిషన్ చర్యలు చేపట్టిందన్నారు. నాణ్యత ప్రమాణాలను నిర్దేశించి వాటి ఆధారంగా డిగ్రీ కళాశాలలను వర్గీకరించి ఫీజులను నిర్ధారించడం ద్వారా జగనన్న విద్యాదీవెన పథకం కింద నిధులు దుర్వినియోగం కాకుండా ఉన్నత విద్యా కమిషన్ చర్యలు తీసుకున్నదని చెప్పారు. ఉన్నత విద్యా కమిషన్ లక్ష్యాలలో ప్రధానంగా... కళాశాలల పర్యవేక్షణలో భాగంగా దాదాపు 258 ఇంజినీరింగ్ కళాశాలలు, 35 ఫార్మసీ కళాశాలలు, 165 ఎంబీఏ, 53 ఎంసీఏ కళాశాలను, 6 అగ్రికల్చర్, 4 హార్టికల్చర్ కళాశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా, ఇతర అంశాలను కూడా జోడించి నిశితంగా పరిశీలించి 93ఇంజినీరింగ్ కళాశాలలను సరైన మౌలిక సదుపాయాలు లేని కళాశాలలుగా గుర్తించి సంబంధిత విశ్వవిద్యాలయాలకు పంపినట్లు చెప్పారు. విశ్వవిద్యాలయాల కమిషన్ ఇచ్చిన వివరాల ఆధారంగా, ఆయా కళాశాలలను తిరిగి తనిఖీ చేసి 36కళాశాలలను 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలలో జీరో ప్రవేశం కేటగిరీ కింద ప్రకటించామన్నారు. ఈ ప్రక్రియను కమిషన్ పర్యవేక్షణలో భాగంగా నిర్వహించామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్య కమిషన్ చట్టం ప్రకారం, కమిషన్‌లో ప్రత్యేక ఫిర్యాదుల విభాగాన్ని (గ్రీవెన్స్ సెల్) ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫిర్యాదుల్లో ప్రధానంగా అందిన వివరాలను ఆయన వెల్లడిస్తూ...విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వకపోవడం, అధిక ఫీజులు వసూలు చేయడం, అధ్యాపకులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం, కళాశాలలో తగిన వసతులు లేకపోవడం, మెడికల్-డెంటల్ విద్యార్థులకు నెలవారి స్టైఫండ్ చెల్లించకపోవడం ప్రధానమైనవిగా ఉన్నాయన్నారు. ఇప్పటివరకు అందిన ఫిర్యాదుల్లో 95శాతం కమిషన్ విజయవంతంగా పరిష్కరించిందని, బహుశా ఏ ఇతర ప్రభుత్వ విభాగాల్లోనూ ఈ విధంగా ఫిర్యాదులను పరిష్కరించి ఉండకపోవచ్చు అని అన్నారు. మెడికల్, డెంటల్ పీజీ విద్యార్థులకు 2016-17 విద్యా సంవత్సరం నుంచి చెల్లించాల్సిన నెలవారి స్టైఫండ్ బకాయిలు సుమారు రూ.9కోట్ల ఆయా కళాశాలలు చెల్లించేలా కమిషన్ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఇది కమిషన్ చేపట్టిన ఒక ప్రధానమైన చర్యగా చెప్పుకోవచ్చని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

తక్షణమే బదిలీల షెడ్యూలు విడుదల

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల మంది ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఏపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో సంయుక్త సంచాలకులు (జేడీ సర్వీసెస్) ఎం.రామలింగాన్ని శుక్రవారం ఎస్టీయూ నేతలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రస్తుత బదిలీలలో సర్వీస్, స్టేషన్ పాయింట్లు వెయిటేజి ఇవ్వాలని, డీఎస్సీ-2008 ఉపాధ్యాయులకు రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ పదోన్నతులు చేపట్టాలని, ఎస్ఎస్‌సీ పరీక్షలలో సస్పెండై ఆరు నెలలు అయినందున ఆ ఉపాధ్యాయులను తక్షణమే రివోక్ చేయాలని కోరారు. ముఖాధారిత హాజరుపై 10 నిమిషాల మినహాయింపు ఇవ్వాలని, పల్నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అచ్చంపేట ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్‌లను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించాలని, ఎంఈవో పోస్టులు 690 పదోన్నతులు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు యాజమాన్యం వారీగా ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న జెడ్పీ పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాల తుది చెల్లింపులు తక్షణమే చేపట్టాలని కోరారు. తూర్పు గోదావరిజిల్లా ఇన్ సర్వీస్ బీపీఈడీ వారికి పత్రాలు ఆలస్యంగా వచ్చినందున పదోన్నతి కల్పించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల డ్రాయింగ్ అధికారాలు, భవిష్యనిధి సౌకర్యం వేగవంతం చేయాలని, ప్రభుత్వంలో కలిసిన ఎయిడెడ్ ఉపాధ్యాయులరే హెల్త్‌కార్డులు, భవిష్యనిధి; గురుకుల, ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, కస్తూర్బా ఉపాధ్యాయులకు 11వ వేతన సంఘం ప్రతిపాదనల మేరకు ఎంటీఎస్ కనీస వేతన చట్టాలన్నీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు దొరబాబు, చిన్న పాలయ్య పాల్గొన్నారు.

జనవరిలో సీఎస్‌ల సమావేశం

కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జనవరిలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశాన్ని దిల్లీ నుంచి నిర్వహించనున్నట్లు కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ తెలిపారు. ఈ క్రమంలో ఆయన గురువారం అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్రపాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. జనవరి 5-7 తేదీల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల ద్వితీయ సమావేశాన్ని నిర్వహించనున్నామని, అందులో చర్చించాల్సిన ముఖ్య అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశం వల్ల రాష్ట్రాల్లో అమలయ్యే వివిధ అభివృద్ధి-సంక్షేమ పథకాలతో పాటు వినూత్న కార్యక్రమాల గురించి తెలుసుకోవచ్చు అని, ఉత్తమ పద్ధతులను మీ రాష్ట్రాల్లో అమలు చేసే వీలు కలుగుతుందని రాజీవ్ అన్నారు. సీఎస్ సమావేశానికి నీతి ఆయోగ్ నేతృత్వంలోని నిర్వహణ కమిటీ ఏర్పాట్లు చేస్తోందని చూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.సమీర్ శర్మ మాట్లాడుతూ ప్రతి రాష్ట్రానికి కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను డాక్యుమెంట్ రూపంలో చూపేందుకు అవకాశం ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్‌లో మహిళల భద్రతకు 'దిశ' యాప్ గురించి ప్రజెంటేషన్ ఇస్తామని అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, అజయ్ జైన్, ముఖ్య కార్యదర్శులు ఎంటీ కృష్ణబాబు, రవిచంద్ర, అనిల్‌కుమార్ సింఘాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం రద్దు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు డిమాండ్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: జాతీయ నూతన విద్యా విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. ఇక్కడి నీలం రాజశేఖర రెడ్డి భవన్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగానికి, ఫెడరల్ సూత్రాలకు వ్యతిరేకంగా ఎన్డీయే ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. నూతన విద్యా విధానాన్ని విద్యార్థి లోకం వ్యతిరేకించాలన్నారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా కేంద్రం పై ఒత్తిడి తెచ్చేందుకు నవంబరు 25 న చలో పార్లమెంటు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రముఖ్యమంత్రి జగన్ విద్యా వ్యవస్థను పూర్తిగా అభివృద్ధి చేశానని గొప్పలు చెబుతున్నారని సామాన్యులు, మధ్యతరగతి విద్యార్థులకు చదువు అందని ద్రాక్ష పండులా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నామమాత్రంగానే ఉందని కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు కల్పించి ప్రైవేట్ కార్పరేట్ విద్యాసంస్థలను పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, విద్యదీవెన,వసతి దీవెన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుల్లాయి స్వామి, చిరంజీవి, సహాయ కార్యదర్శులు రమణయ్య, కృష్ణ,కార్యవర్గ సభ్యులు ఉమా మహేష్, వేణు, వంశీ, అంజి,రాజేష్, రజిని, ఆదర్శ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కపట ప్రేమతో బీసీల అణచివేత

సీఎం జగన్‌పై యనమల రామకృష్ణుడు ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కపట ప్రేమ చూపుతూ బడుగు బలహీన వర్గాలను సీఎం జగన్ అణగదొక్కుతున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని బీసీలంతా ఏకమై జగన్ మోసాలు, దుర్మార్గాలకు త్వరలోనే శుభం కార్డు వేసి.. నియంతృత్వానికి సమాధి కట్టడం తధ్యమని హెచ్చ రించారు. గురువారం జూమ్ ద్వారా యనమల మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్ని బీసీలకు ఇస్తే.. వైసీపీ ప్రభుత్వం రెడ్లతో నింపిందన్నారు. బీసీల ఆస్తులను దిగమిం గిన విజయసాయిరెడ్డి, ఆయన ఆధ్వర్యాన బీసీల సభ నిర్వహించడం వైసీపీ చేస్తున్న ద్రోహానికి నిలువెత్తు నిదర్శనంగా పేర్కొన్నారు. మూడున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలోని బీసీలకు ఇక్కట్లు తప్ప ఏమీ మిగలలదన్నారు. ఏపీఐఐసీ, టీటీడీ చైర్మన్, యూనివర్సిటీ వీసీలు, సలహాదారులు, ప్రభుత్వ న్యాయవాదులతో సహా రాష్ట్రంలోని అన్ని కీలక నామినేటెడ్ పదవుల్లో తెలుగుదేశం ప్రభుత్వం బీసీలను నియమిస్తే ఇప్పుడు మొత్తం రెడ్లతో నింపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలపై రెడ్లకు పెత్తనాన్ని అప్పగించడం నిజం కాదా? ఇది బీసీలను అణచివేయడం కాదా? అని ప్రశ్నించారు.

'బుద్ధ ఇన్‌ఫ్రాఎస్టేట్'పై విచారణ జరిపించండి

- భావన టౌన్‌షిప్ లేఅవుట్‌కు అనుమతివ్వొద్దు
- కమ్యూనిస్టు పార్టీ రాయలసీమ అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు గ్రామ పరిధిలో రూ.600 కోట్లు విలువచేసే 50 ఎకరాల ప్రభుత్వ భూమిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత మేనమామ, రియల్ ఎస్టేట్ మాఫియా కబ్జా చేసిందని కమ్యూనిస్టు పార్టీ రాయలసీమ అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఊటుకూరుకు సంబంధించిన సర్వే నంబర్ 602/1ఏ నుంచి 720/2 వరకు ఉన్న 50 ఎకరాల భూమిని బుద్ధ ఇన్ఫ్రాఎస్టేట్ కంపెనీ 2020, అక్టోబర్ 19న కొనుగోలు చేసినట్టు రికార్డులు సృష్టించినట్టు చెప్పారు. అందులో 23 ఎకరాలకు సంబంధించి భావన టౌన్‌షిప్ పేరుతో కడప నగరపాలక సంస్థలో లేఔట్‌కు దరఖాస్తు చేశారన్నారు. బుద్ధ ఇన్ఫ్రా ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఎం సొంత మేనమామ రవీంద్రనాథ్ రెడ్డిది అన్నారు. అయితే గతంలో ఈ భూమిని తమకు కేటాయించాలని 2000లో బుకారియా ఎడ్యుకేషనల్ సొసైటీ కలెక్టర్‌కు అప్పీల్ చేసుకుంది. ఈ స్థలంలో మెడికల్ కాలేజీ నిర్మించడానికి అని పేర్కొంది. ఈ భూమి ప్రభుత్వానిదని, సొసైటీకి ఇవ్వడం సాధ్యం కాదని నాడు అధికారులు స్పష్టం చేశారన్నారు. అనంతరం దానిని బుద్ధ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి కేటాయించారన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై హైకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిషన్ వేసి విచారణ జరిపించాలని రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు లింగ మూర్తి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు మక్బూల్ భాష, కే శంకర్, వెంకటేష్, గోవర్ధన్ రావు, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల నిషేధం వాయిదా వేయాలి

సీఎం జగన్‌కు సీపీఎం నేత శ్రీనివాసరావు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఫ్లెక్సీలపై నిషేధం విధించడానికి ముందు దానిపై అవుట్ ఆఫ్ హోమ్ అడ్వర్టయిజ్‌మెంట్ల పరిశ్రమలోని ఉత్పత్తిదారులతో చర్చించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని సీపీఎం ఏపీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. వారితో చర్చించకుండా నిషేధం అమలు చేస్తే ఆ పరిశ్రమపై ఆధారపడే వారు ఇబ్బంది పడతారని, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను చూపాలని డిమాండు చేశారు. దీనిపై సముచిత పరిష్కారం కనుగొనేంత వరకు ఫ్లెక్సీలపై నిషేధాన్ని వాయిదా వేయాలని కోరుతూ ఆయన గురువారం సీఎం జగన్‌కు లేఖ రాశారు. 'నవంబరు నుంచి ఫ్లెక్సీల ఉత్పత్తి, వినియోగాలను నిషేధిస్తూ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. దేశంలో ఏటా 12 వేల కోట్ల వ్యాపారం అవుట్ ఆఫ్ హోమ్ అడ్వర్టయిజ్‌మెంట్ల పరిశ్రమలో జరుగుతుంది. ఎలాంటి ప్రత్యామ్నాయ అవకాశాలు చూపకుండా నిషేధం విధిస్తే ఆ రంగంపై ఆధారపడే ఉత్పత్తిదారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు చర్యలను ప్రభుత్వం తీసుకోవాలి' అని లేఖలో శ్రీనివాసరావు పేర్కొన్నారు.

అరెస్టులు అక్రమం: నెల్లూరు ఏపీ జెన్కో శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నవారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు శ్రీనివాసరావు వెల్లడించారు. సీఎం పర్యటన క్రమంలో నాయకులను వారి ఇళ్లకు వెళ్లి మరీ ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. దీనిని ప్రజాతంత్రవాదులు నిరసించాలని కోరారు. అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలని శ్రీనివాసరావు డిమాండు చేశారు.

ప్రియురాలికి సందేశాలు పంపుతున్నాడని

బాల్యమిత్రుడి హత్య

- ఇన్‌చార్జి డీఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు
- గంటల వ్యవధిలో కేసు ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: ఇద్దరూ బాల్య మిత్రులు... ఇద్దరిదీ ఒకే ప్రాంతం... పైగా ప్రాణమిత్రులు. అయితే వీరిద్దరి మధ్య ఓ అమ్మాయి ప్రేమ వ్యవహారంలో తలెత్తిన గొడవ కాస్త బాల్య మిత్రుడిని హతమార్చేలా చేసింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గురువారం విజయనగరం ఇన్‌చార్జ్ డీఎస్పీ టి.త్రినాథ్ పట్టణ పోలీస్ స్టేషన్లో వెల్లడించారు. పట్టణంలోని కె.ఎల్.పురంనకు చెందిన తోరోతు రమణ తన కుమారుడు నవీన్ ఈనెల 25న అదృశ్యమై, ద్వారపూడి బ్రిడ్జి వద్ద శవమై కనిపించినట్లు 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమారుడు ఈనెల 24వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదనీ, ద్వారపూడి రైల్వే ట్రాక్ వద్ద కాలువలో మృతి చెంది ఉన్నట్టు కొందరు చెప్పడంతో 25న ఉదయం అక్కడకు వెళ్లి చూడగా దేహంపై గాయాలుండడంతో ఎవరైనా చంపి ఉంటారన్న అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో విచారణ చేపట్టిన విజయ నగరం ఇన్‌చార్జ్ డీఎస్పీ టి.త్రినాథ్ ... ఒకటో పట్టణ సీఐ బి.వెంకటరావు, ఎస్సైలు అశోక్, రామ గణేష్, విజయకుమార్, దుర్గా ప్రసాద్‌లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మృతుడి స్నేహితులను విచారించగా, మృతుడు నవీన్, బ్రహ్మాజీ ఇద్దరూ మంచి స్నేహితులని, తరుచూ కలిసి తిరిగేవారని చెప్పారు. బొద్దూరు బ్రహ్మాజీ అలియాస్ బాలు, నవీన్ హత్య జరిగిన తరువాత నుంచి పరారీలో ఉండడంతో, అనుమానంతో బాలును అదుపులోకి తీసుకొని విచారించడంతో నిందితుడు బ్రహ్మాజీ (బాలు), నవీన్‌ను హత్య చేసినట్లు అంగీకరించాడు. తాను ప్రేమించిన అమ్మాయికి మృతుడు నవీన్ తరుచూ వాట్సాప్ సందేశాలతో పాటు ఫోన్ చేసి వేధించడంతో నవీన్‌ను పలు మార్లు హెచ్చరించినప్పటికీ మార్పు రాలేదని చెప్పాడు. నవీన్ నంబర్లను ఆ యువతి బ్లాక్ చేసింది... అయినా వేర్వేరు నంబర్లతో మెసేజ్‌లు పంపుతున్నట్లు ఆ యువతి నిందితుడు బ్రహ్మాజీకి తెలియజేయడంతో ఒక పథకం ప్రకారం నవీన్‌ను తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. హత్యా పథకంలో భాగంగా 24 రాత్రి 8 గంటల సమయంలో బ్రహ్మాజీ (బాలు), మృతుడు నవీన్ ఇద్దరూ కలసి ద్వారపూడి రైల్వే బ్రిడ్జి వద్దకు వెళ్లారు. ఆ యువతి విషయంలో ఇద్దరూ వాదనకు దిగారు. మృతుడు నవీన్ దురుసుగా మాట్లాడుతూ బాలును తోయడంతో అక్కడే ఉన్న సరుగుడు కర్రతో నవీన్‌ను బలంగా కొట్టి హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. ఈ కేసును గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు.

సంపాదకీయం

తిరగబడ్డ ఫిరాయింపు నాటకం

తెలంగాణ రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్.) కి చెందిన నలుగురు శాసనసభ్యులకు దండిగా డబ్బు ముట్టచెప్పి తమ పార్టీలో చేర్పించడానికి బీజేపీ కుట్ర పన్నిందన్న ఆరోపణలో నిజానిజాలు వెంటనే తెలియక పోవచ్చు. ఆ నిజం నిష్పాక్షిక విచారణాధారం. తన ఎమ్మెల్యేలు గీత దాటి అమ్ముడుపోకుండా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అడ్డుకోగలిగారు. ఎన్నికలలో మెజారిటీలేని రాష్ట్రాలలోనూ ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనేసి ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో బీజేపీ అద్వితీయమైన కౌశలం సంపాదించింది. ప్రజా ప్రతినిధులు అమ్మకం సరుకుగా మారిపోయి చాలాకాలం అయింది కనక బేరసారాలకు ఎప్పుడూ అవకాశం ఉంటుంది. ఒక్కొక్కరికి కోట్లాది రూపాయలు ముట్టచెప్పి తమవేపు తిప్పుకోవడానికి కావలసిన ఆర్థిక స్తోమత బీజేపీకి ఉంది. ఎన్నికల బాండ్లు అమలులోకి వచ్చిన తరవాత ఆ ఖాతా కింద పోగుపడే మొత్తంలో 85శాతం బీజేపీకే దక్కుతోందన్నది వాస్తవం. చెలామణిలో ఉంటేనే డబ్బుకు విలువ. అందుకని తమ ఖజానాలో మూలుగుతున్న డబ్బును ప్రజా ప్రతినిధులను కొనడానికి వెచ్చిస్తోంది భారతీయ జనతా పార్టీ. టి.ఆర్.ఎస్. ఎమ్మెల్యేలను కొనడానికి ప్రయత్నించారన్న ఆరోపణలను బీజేపీ కొట్టి పారేయడం సహజమే. పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫాంహౌజ్‌లో ఎమ్మెల్యేలతో బేరసారాలు కుదుర్చుకోవడానికి పన్నిన పన్నాగం బయట పడింది. రోహిత్ రెడ్డే ఈ కుట్రను భగ్నం చేశారంటున్నారు. ఆయన నిజాయితీకి జోహార్లు అర్పించాల్సిందే కదా! మొత్తం నలుగురు ఎమ్మెల్యేలను బీజేపీ కొనాలనుకుందట. ఈ బేరం కుదిరిస్తే రోహిత్ రెడ్డికి వంద కోట్ల రూపాయలు, మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలకు యాభై కోట్ల చొప్పున ఇస్తామన్నారట. ధరలు మండిపోతున్న దశలో ఒక్కో ఎమ్మెల్యే ఆ మాత్రం ధర పలకడంలో ఆశ్చర్యం ఏముంది కనక! డబ్బిచ్చి ప్రజా ప్రతినిధులను బీజేపీ కొనడానికి ఓ ప్రత్యేక పదబంధం ప్రచారంలోకి వచ్చింది. అదే ఆపరేషన్ లోటస్. రోహిత్ రెడ్డి ఫిర్యాదు చేసిన తరవాత హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన పూజారి సతీశ్ శర్మ అలియాస్ రాంచంద్ర భారతి, తిరుపతికి చెందిన గురువు డి. సిం హయ్యాజీ, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి నందకుమార్ ను అరెస్టు చేశారు. బీజేపీలో చేరితే తమకు భారీ మొత్తంలో డబ్బు, కాంట్రాక్టులు, పదవులు ఇస్తామని ప్రలోభ పెట్టారని ఈ శాసనసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ మాటవిని బీజేపీలో చేరకపోతే కేసులు మోపుతామని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఈడీ) దాడులు జరుగుతాయని బెదిరించారని కూడా టి.ఆర్.ఎస్. ఎమ్మెల్యేలు తెలియజేశారు. టి.ఆర్.ఎస్. ప్రభుత్వాన్ని పడగొడ్తామని కూడా చెప్పారట. టి.ఆర్.ఎస్. శాసనసభ్యులను కొనడానికి బీజేపీ ప్రయత్నించిందన్న ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇదంతా కె.సి.ఆర్. నాటకమనీ ఈ నాటకానికి రచన, కథ, మాటలు, పాటలు అన్నీ కె.సి.ఆర్. అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తన సహజ శైలిలో విరుచుకుపడ్డారు. ఈ సంఘటన జరిగిందంటున్న ఫాం హౌజ్‌కు పోలీసులు రాకముందే మీడియా అక్కడ ప్రత్యక్షమైందని లోపల ఏం జరిగిందో వివరించిందనీ, వారిని ఫాంహౌజ్‌లోకి ఎందుకు అనుమతించారు? దీనితో బీజేపీకి సంబంధం ఏమిటి? టి.ఆర్.ఎస్. చెప్తున్న వారితో బీజేపీకి ఎలాంటి సంబంధమూ లేదు అని కిషన్‌రెడ్డి అంటున్నారు. ఇందులో పోలీసు ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉందని ఆయన చెప్పారు. 119 మంది సభ్యులున్న శాసనసభలో టి.ఆర్.ఎస్.కు 103 మంది మద్దతు ఉండగా ముగ్గురు ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి తాము ఏం చేయగలుగుతామని కిషన్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చడానికి ఈ ముగ్గురు ఎమ్మెల్యేలను కొంటే సరిపోదన్న మాట నిజమే. కానీ ఇటీవల మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని ఎన్.సి.పి., కాంగ్రెస్, శివసేన కూటమి ప్రభుత్వాన్ని కూల్చడంలో బీజేపీ పాత్రను నిరాకరించలేం. తిరుగుబాటు చేసింది ఏక్‌నాథ్‌షిండే కావచ్చు. తెర వెనక నాటకం ఆడించి ఉద్ధవ్‌ఠాక్రే ప్రభుత్వాన్ని దించి, షిండేను ముఖ్యమంత్రిని చేసి బీజేపీ ఆ ప్రభుత్వంలో భాగస్వామి అయిన వైనాన్ని ఎలా కాదనగలం!

టి.ఆర్.ఎస్. ఎమ్మెల్యేలను కొనడానికి తాజాగా జరిగిన ప్రయత్నాన్ని పక్కన పెట్టినా 18 మంది టి.ఆర్.ఎస్. ఎమ్మెల్యేలు బీజేపీలో చేరతారని గత ఆగస్టులో ఓ బీజేపీ నాయకుడు బహిరంగంగానే చెప్పారు. దిల్లీ, పంజాబ్ ప్రభుత్వాలను కూలదోయడానికి తమ ఎమ్మెల్యేలకు మదుపుపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇటీవలే ఆరోపించారు. నవంబర్ మూడున మునుగోడు శాసనసభ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలలో బీజేపీ టీ.ఆర్.ఎస్.తో తల పడ్తోంది. ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొనుగోళ్ల నాటకానికి తెరలేచి ఉండవచ్చు. టి.ఆర్.ఎస్.కు ప్రస్తుతానికి ఎదురు లేదు. కానీ 2023లో జరగవలసి ఉన్న ఎన్నికలలో తెలంగాణలో అధికారం సంపాదించాలని బీజేపీ ఆత్రుత చూపుతోంది. కొనుగోళ్ల కార్యక్రమం నిరాఘాటంగా సాగి ఉంటే ఈ నలుగురు ఎమ్మెల్యేలు అక్టోబర్ 31 న మునుగోడులో బీజేపీ అధ్యక్షుడు జె.పి. నడ్డా పాల్గొనబోయే సభలో కాషాయ కండువాలు కప్పుకోవలసింది. తెలంగాణలో పాగా వేయడానికి బీజేపీ తీవ్రంగా కృషి చేస్తోందన్నది వాస్తవం. నడ్డాతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇటీవల తరచుగా ఏదో ఓ కారణంతో తెలంగాణకు వస్తూనే ఉన్నారు. బీజేపీ పన్నాగాలను భగ్నం చేయడంలో కె.సి.ఆర్. సామర్థ్యాన్ని, ఎత్తుగడలను, వ్యూహాలను తక్కువ అంచనా వేయలేం. ఆయన రాజకీయం ఈ మూడు అంశాల చుట్టే తిరుగుతూ ఉంటుంది. తెలంగాణలో ఒకప్పుడు బలంగా ఉన్న తెలుగు దేశం పార్టీని ఓటుకు నోటు కేసులో ఇరికించి అస్తిత్వమే లేకుండా చేసిన వ్యూహకర్త కె.సి.ఆర్.

ఇప్పుడు అదే రీతిలో బీజేపీ దిమ్మ తిరిగేట్టు చేశారు. ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పారిన బీజేపీ పాచికలు తెలంగాణలో పారలేదు. అయితే టి.ఆర్.ఎస్. నేతలు పక్క చూపులు చూడలేదని ఖాయంగా చెప్పలేం. ఎందుకంటే గతంలో కొంతమంది కాషాయ కండువాలు కప్పుకున్నారు. వారిలో కొందరిని కె.సి.ఆర్. మళ్లీ టి.ఆర్.ఎస్.లోకి తీసుకురావడంలో సఫలమై ఉండొచ్చు. బీజేపీ విసురుతున్న సవాలును ఎదుర్కోవడానికి ఎన్నికలు జరిగేదాకా వేచి ఉండాలని కె.సి.ఆర్. అనుకుంటున్నట్టు లేదు. అందుకే తమ ఎమ్మెల్యేలకు వలపన్నాలని బీజేపీ ప్రయత్నిస్తే అదే వలలో కె.సి.ఆర్. చాకచక్యంగా బీజేపీని ఇరికించేశారు. దిల్లీ మద్యం వ్యవహారంలో కె.సి.ఆర్. కుమార్తెను ఇరికించడానికి బీజేపీ ప్రయత్నించింది. ఆ కసి కూడా కె.సి.ఆర్. తీర్చేసుకున్నారు. బీజేపీని నైతికంగా దెబ్బ తీయడంలో కె.సి.ఆర్. సఫలమైనట్టే. కోట్ల రూపాయలతో పట్టుబడ్డ బీజేపీ దళారులు మాత్రం అడ్డంగా దొరికిపోయారు.

మను ధర్మం మానవ ధర్మమా...!

రా బావ ఏంటి నాల్గు రోజులు రాలేదు. పార్వతి మీ అన్నయ్యకు కూడ కాఫీ పట్టుకురా. ఏంలేదు బావ మా అబ్బాయి ఫోను చేస్తే హైదరాబాదుకు వెళ్లా. తీరా అక్కడ మునుగోడు ఎన్నికలలో రాజకీయ నాయకులు ఓటర్లకు మద్యం, మాంసం పంచుతున్నారని విని నా మతి పోయిందనుకో. ఆ విషయం అలా ఉంచితే ముఖ్యంగా బీజేపీ చేసే ప్రచారంలో నిబద్ధత, పట్టుదల చూస్తే నాకు గతంలో 50 ఏళ్ల నాటి కమ్యూనిస్టులు గుర్తుకొచ్చారనుకో బావ. నిజమే బావ ఆర్‌ఎస్‌ఎస్ వలే ఆనాడు కమ్యూనిస్టు నాయకులు క్రమశిక్షణ అలవాటు చేసేవారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు హెగ్డేవార్, గోవాల్కర్ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను అలా తీర్చిదిద్దారు. అది సరే బావ అసలు మను ధర్మమే మానవ వాదమని, మను సిద్ధాంతమే ఆచరణీయమని చెబుతారు అదేంటి బావ. ఏముంది వీళ్లైతే మరల చాతుర్ వర్ణ వ్యవస్థ తెచ్చి నాల్గో వర్ణమైన శూద్రులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ వేదం చదివి, పిలక పెట్టుకుని పాలన సాగించాలనే తపన ఆర్‌ఎస్‌ఎస్‌కు సహజంగానే ఉంటుంది బావ. అంతెందుకు నిన్నగాక మొన్న సరయూ నది ఒడ్డున కూర్చుని ప్రధాని మోదీ శ్రీరాముని పాలన తనకు ఆదర్శమన్నారుగా బావ. అది సరే బావ హిందువులకు ఆరాధ్య దైవంగా భావించే శ్రీరాములవారు తనతో కాపురం చేసిన మహా సాధ్వీ సీతమ్మ గుణం తెలియకే అడవుల పాలుచేశారంటావా.

అది తెలియక కాదు బావ. ప్రజలకు తెలియజెప్పడానికి అలా చేయాల్సి వచ్చిందని శ్రీరామ భక్తుల ఉవాచ. అది సరే బావ ప్రజల్ని నాలుగు అయిదు వర్ణాలుగా విభజించిన మను ధర్మశాస్త్రం బీజేపీ వాళ్లు

అంటున్నట్లు మానవ ధర్మశాస్త్రం ఎలా అవుతుంది? కానేకాదు బావ. సంపాదించడానికి వైశ్యులను, పాలనకు క్షత్రియులను పక్కన పెట్టుకుని వారికి సలహాలు యిస్తూ గీతోపదేశం చేస్తూ కూర్చుని తినడానికి అలవాటుపడ్డవారు మరల తిరిగి మనుధర్మం యిప్పటికీ అవసరమే అంటూ దాన్ని రాజ్యాంగంగా మార్చాలని వారి ప్రయత్నం బావ. ప్రస్తుతం కోట్లాది మంది హిందువులు ఇప్పటికీ అనుసరిస్తున్న ఆచార వ్యవహారాలకు మనుస్మృతే కారణం అంటున్నారుగా బావ. అందుకే ఆ మనుస్మృతియే హిందూ చట్టం కావాలని బీజేపీ కోరిక బావ. అదిసరే బావ ఈమధ్య వారి నోట మరో వింత వాదన విన్నా అదేమిటంటే మనుస్మృతిలో ఉన్న చట్టాలు యిప్పటికీ ప్రపంచంలోని అనేకదేశాలు ప్రశంసలతో ముంచెత్తుతున్నాయని. అదేంటి బావ ఆ మాటలు చెప్పి యువతను ఆకర్షించడానికి తప్ప మన దేశం దాటితే మహాభారతంలో శ్రీకృష్ణుడుగాని, రామాయణంలోని రాముడుగాని, ఎవరికీ తెలియదు. అటువంటపుడు ఇతర దేశాల ప్రశంస లంటే ఎంత అబద్ధమోచెప్పు. అంతేకాదు బావ జాతీయ విలువలన్నా, సమసమాజమన్నా తిరస్కరిస్తూ మనుధర్మం పాటించాలనేది బీజేపీ ఆకాంక్ష బావ. అంతేకాదు చాతుర్ వర్ణ వ్యవస్థ కృష్ణుడు గీతలోనే చెప్పారనేది మహా అబద్ధం బావ. అసలు గీత ఏకాలం నాటిదో ఆలోచించాలి.

ఆదిశంకరాచార్యులు భగవద్గీతను వివరమైన భాష్యంతో ప్రసిద్ధం చేయడానికి ముందు గీత గురించి భారత ప్రజలకు తెలియదు బావ. అసలు దేశంలో పుట్టే ప్రతి బిడ్డను చాతుర్ వర్ణతాత్మతో కట్టిపడేసి చని పోయే వరకు ఆ వ్యవస్థలోనే ఉంచాలనేది మనువాదుల కోరిక బావ. రాజ్యాంగాన్ని మను సిద్ధాంతంలో మరల లిఖించాలనేది బీజేపీ ప్రగాఢ వాంఛ. నిజమే బావ నిశితంగా పరిశీలిస్తే హిట్లరులా తయారవుతున్నట్లుగా ఈ బీజేపీ ఆలోచనగా కనబడుతోంది బావ. అది సరే నేను స్కూలులో చదివేటపుడు కొంతమంది విద్యార్థులు వచ్చి ఆడుకుందాంరమ్మని తీసి కెళ్లారు. అక్కడ ఒకాయన నిక్కరువేసుకుని ఆటలకుముందు హిందూయిజం మనువు గురించి వివరించి వేరే ఆలోచనలు చేయకుండ పాటించమని చెప్పాడు బావ. నిజమే బావ గురువు గోవాల్కర్ ఏం చెబుతాడంటే చెప్పింది విని యితర ఆలోచనలు చేయొద్దంటారు. అసలు ఆలోచన చేయకపోతే అభివృద్ధే శూన్యం కద బావ. నిజమే వాళ్లు మనువు చెప్పింది ఆచరించడం తప్ప వేరే ఆలోచన చెయ్యవద్దంటారు. మనిషి ఆలోచించేది తలతోనే కదా. ఆ తలమాది బాహువులైన క్షత్రియులు పాలన జేస్తే తొడలైన వైశ్యులు వ్యాపారం చేసి సంపాదిస్తే మిగతా వారంతా మా ముగ్గురికి దాస్యం చేయాలని బ్రాహ్మణుడి ఉవాచ. అదే మనుస్మృతి అంటారు. అమ్మ బాబోయ్ యిదేంటి బావ మనుస్మృతిని రాజ్యాంగంగా మారిస్తే అపుడు మన పరిస్థితేంటి బావ. ఏముంది బావ ఎప్పటికైనా ఆ పని చేయాలనేది మనువాదుల ప్రగాఢ వాంఛ బావ. అందుకే ఆర్‌ఎస్‌ఎస్ కొంతమంది పిల్లల్ని కని సమాజం పై వదిలింది. యిదేంటి బావ కొత్త విషయం చెబుతున్నావు. వారెవరు బావ. వారెవరంటే బీజేపీ, ఏబీవీపీ, హిందూ జాగారణమంచ్, సంస్కార భారతి, విశ్వ హిందూపరిషత్, భజరంగదళ్, లాంటివి అనేకం ఉన్నాయి. గతంలో ఇందిరాగాంధీ నియంతృత్వ పోకడలను అడ్డుకోవడానికి జయప్రకాశ్‌నారాయణ ఉద్యమం చేపట్టినపుడు అప్పటి జన సంఘ్ పార్టీ కూడ అందులో చేరింది. అయితే ఆర్‌ఎస్‌ఎస్‌లో సభ్యత్వం వదులుకొని వస్తామని జయప్రకాశ్‌ను నమ్మించారు. ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిన జనసంఘ్ పార్టీ బీజేపీగా మారి తమ మాతృసంస్థలో మళ్లీ చేరిపోయింది. వారు ద్వంద్వ సభ్యత్వాన్ని వదులుకోలేదు. నిక్కరు వేసుకుని లాఠీలు పట్టినవారిని ఎదుర్కోవడానికి కొంతమంది ప్రాణాలు పోయినా పరవాలేదు. మాటలు, రాతలు చాలవు బావ. నీవన్నట్లు వాళ్లను ఎదుర్కోవాలంటే రెడ్‌షర్టు వాలంటీర్లు కర్ర చేత పట్టాల్సిందే బావ. నిజమే బావ కమ్యూనిస్టులు గతంలోవలె ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తే అసాధ్యం కాదు బావ.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు, సెల్: 9885569394

నేనెరిగిన రాఘవాచారి

టి.వి. సుబ్బయ్య

జీవితాంతం నిబద్ధతగల కమ్యూనిస్టుగా జీవించిన చక్రవర్తుల రాఘవాచారి ప్రతిభలో సంపాదక చక్రవర్తి. పత్రికారంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులలో బహుశా రాఘవాచారి పేరు తెలియని వారుండరు. సాహిత్యం, సంగీతం, లలితకళలు, సినిమా, సాంఘిక, పౌరాణిక నాటకాలు, రాజకీయాలు, న్యాయశాస్త్ర తదితర అనేక విభాగాలలో లోతైన పరిజ్ఞానం గలవారు ఆయన. పౌరాణిక, సాంఘిక నాటకాలకు ఆయనతో పాటు నేను వెళ్లే వాడిని. విజయవాడ వన్‌టౌన్‌లో పౌరాణిక నాటకాలకు వెళ్లి తెల్లవారుఝాము వరకు చూసి తిరిగివచ్చేటప్పుడు బృందావన్ హోటల్‌లో టిఫిన్ తిని విశాలాంధ్ర కార్యాలయానికి చేరుకొనేవాళ్లం. రాఘవాచారి అప్పటికే వచ్చి ఉన్న వివిధ పత్రికలు చదివి సమీపంలోనే ఉన్న ఇంటికి వెళ్లేవారు. కాలకృత్యాలు తీర్చుకుని ఉదయం పదిగంటల లోపే విశాలాంధ్రకు వచ్చి సంపాదకీయం రాసేవారు. నాటకాలకు ఉషశ్రీ తప్పకుండా వచ్చేవారు. ఇద్దరూ నాకు నాటకాలు, ఆనాటి నటులను గురించి, నాటకాల విశిష్టతను గురించి వివరించేవాళ్లు. నేను 1976లో విశాలాంధ్రలో చేరిన తర్వాత దాదాపు రెండేళ్లు ఆఫీసులోనే ఎక్కువగా గడిపేవాడిని. పని నేర్చుకునేందుకు అక్కడ లభించే పుస్తకాలు చదవడానికి ఉండేవాడిని. పుస్తకాలు, పత్రికలు చదవమని రాఘవాచారి ఎక్కువగా ప్రోత్సహించేవారు. ఆయనరాసే సంపాదకీయాలను ఆఫీసు కంపోజింగ్ సెక్షన్‌లో పనిచేసే పంతులు అనే కార్మికుడు మాత్రమే చేసేవాడు. ఎందుకంటే రాఘవాచారి చేతిరాత అందరూ చదవలేనంత గొలుసుకట్టుగా ఉంటుంది. అప్పుడు ఇనుముతో చేసిన అక్షరాలను కూర్చి కంపోజ్ చేసేవాళ్లు. కంప్యూటర్లు వచ్చాక విజయవాడలో నడుస్తున్న పత్రికలన్నింటికంటే ముందే విశాలాంధ్రలో ప్రవేశపెట్టారు. జనరల్ మేనేజర్ టీ. వెంకటేశ్వరరావు, రాఘవాచారి తదితరులు కంప్యూటర్లు ప్రవేశ పెట్టడానికి యాజమాన్యాన్ని ప్రోత్సహించారు.

ఎక్కడ సంగీత, సాహిత్య సమావేశాలు జరుగుతున్నా రాఘవాచారి తప్పకుండా హాజరయ్యేవారు. ఆయన లేకుండా సమావేశం జరగడం లోపంగా భావించి నిర్వాహకులు ఆహ్వానించి తీసుకువెళ్లేవారు. సందర్భానికి, సబ్జెక్టు తగినట్లుగా లోతుగా మాట్లాడేవారు. అందువల్ల రాఘవాచారి లేని సభ రక్తి కట్టదని అనేవారు. ఆయనను నడుస్తున్న విజ్ఞాన గ్రంథాలయంగా చెప్పేవారు. అందుచేతనే పుస్తకాల ఎగ్జిబిషన్‌లో జరిగే కార్యక్రమాలకు తప్పక తీసుకెళ్లేవారు. కొన్నిసార్లు తానే వెళ్లి చివర కూర్చుని ప్రసంగాలను శ్రద్ధగా వినేవారు. నిర్వాహకులు చూస్తే తప్పనిసరిగా స్టేజ్‌మీదకి ఆహ్వానించేవారు. సినిమాల విషయంలో రాఘవాచారి ఆనాడు సినిమా పంపిణీ సంస్థలో పనిచేసే కాట్రగడ్డ నర్సయ్య, ఈడ్పుగంటి లక్ష్మణరావు తదితరులు తప్పనిసరిగా సినిమా ప్రదర్శనకు ఆహ్వానించేవారు. అప్పుడు విజయవాడ సినిమా పంపిణీ సంస్థలకు కేంద్రంగా ఉండేది. సినిమాలపై సమీక్షల కోసం అన్ని పత్రికల్లో పనిచేసే సమీక్షకులను ఆహ్వానించేవారు. పత్రికల అభిప్రాయాలకు ఆనాడు విలువనిచ్చే వారు. సంగీతం, సాహిత్యం ఆధారంగా నిర్మించిన సినిమాలను రాఘవాచారి ఎక్కువగా ఇష్టపడేవారు. శంకరాభరణ సినిమాపై సమావేశం ఏర్పాటు చేసినప్పుడు దర్శకుడు కె.విశ్వనాథ్ కోరారని రాఘవాచారిని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఈడ్పుగంటి లక్ష్మణరావు తెలిపారు. బహుదూరపు బాటసారి వందరోజులు వేడుకలు మద్రాసులో జరిగాయి. దర్శకుడు దాసరి నారాయణరావు మద్రాసు రావాలని ఈడ్పుగంటి లక్ష్మణరావు పట్టుబట్టినా రాఘవాచారి ఇతరపనుల వల్ల రాలేకపోయారు. సినిమా పేజి చూస్తునందువల్ల నేను వెళ్లగా ప్రత్యేకించి రాఘవాచారి రాలేదేమని దాసరి నారాయణరావు అడిగారు. విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో కన్యాశుల్కం నాటకం పుట్టుపూర్వోత్తరాలు, గురజాడ గురించి వివరించారు. ఇలా అనేక సమావేశాలకు, సభలకు రాఘవాచారితో కలిసి వెళ్లేవాడిని. చిన్నా, పెద్ద అన్న దానితో నిమిత్తంలేకుండా ఎవరినైనా ఎంతో ఆప్యాయంగా పిలిచేవారు. సమావేశాల్లో వ్యంగ్యగా మాట్లాడినా అవి నవ్వు తెప్పించేవి.

విశాలాంధ్రలో కాకుండా మరో ఏ పత్రికలో పనిచేసినా ఇంతకంటే ఎక్కువగా పేరు ప్రఖ్యాతులు వచ్చేవి కదా అని ప్రశ్నిస్తే, ఒక ఆశయం, లక్ష్యం కోసం పనిచేసే పత్రిక విశాలాంధ్రే కదా అని అనేవారు. ఒకసారి జాతీయస్థాయిలో ప్రసిద్ధుడైన జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్‌ను ప్రెస్‌క్లబ్‌కు పిలిచారు. అప్పుడు కాంధారి హెూటల్‌లో ఆయన బస చేశారు. ఆయన్ను తీసుకురమ్మని నాకు రాఘవాచారి జర్నలిస్టుల యూనియన్ నాయకులు అంబటి ఆంజనేయులు చెప్పగా, నా మిత్రుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ రెహమాన్‌తో కలిసి వెళ్లాము. కుల్దీప్‌నయ్యర్ మొదట వేసిన ప్రశ్న, రాఘవాచారి ఎలా ఉన్నారని. అలాగే ఎన్నికలు జరిగిన సందర్భాలు, దివిసీమలో ఉప్పెనలాంటి విపత్తులు వచ్చినప్పుడు సమాచారంకోసం జాతీయ దినపత్రికల విలేకరులేకాక, బీబీసీ విలేకరి కూడా వచ్చి రాఘవాచారిని కలిసి తెలుసుకునేవారు. ఎప్పుడో జరిగిన సంఘటనలను, కోర్టుల తీర్పులను గురించి తేదీలు, గణాంకాలతో సహా రాఘవాచారి చెబుతుంటే నాకు ఆశ్చర్యం వేసింది. సంస్కృత శ్లోకాలను, కోర్టు తీర్పుల్లో కొటేషన్లు అలవోకగా తెలిపేవారు. రేడియో ప్రసంగాలకు, తాజా రాజకీయాలపై రికార్డింగ్‌లకు విధిగా వెళ్లేవారు. రేడియో వార్తాడెస్క్‌లో నేను పనిచేసేటప్పుడు ఇతర అంశాలపై నేను రికార్డింగ్‌లకు వెళ్లినప్పుడు రాఘవాచారిని కలిస్తే ఆయనకు బాగా సన్నిహితులైన చాలామందిని పరిచయం చేసేవారు. అలాగే దూరదర్శన్‌లో విజయవాడ కేంద్రం డిప్యూటీ డైరెక్టరుగా పనిచేసిన హనుమంతరావు 'విజయవాడ ఐకాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో నన్ను భాగస్వామిని చేశారు. ముందుగా రాఘవాచారిని ఇంటర్వ్యూ చేద్దామనుకున్నా వీలుకాలేదు. పదిమంది ఇంటర్వ్యూ అయ్యాక రాఘవాచారిని అడిగితే మొదట ఎందుకులే అన్నారు. బలవంతం చేశాక అంగీకరించారు. విజయవాడ నుండి హైదరాబాదు తరలివెళ్లేందుకు ఇష్టపడలేదు.

ఆయన మరణానికి రెండునెలల ముందు హైదరాబాదు నుంచి విజయవాడ వచ్చి శాంతి సంఘం నాయకులు జమిందారు ఇంట్లో ఉన్నారు. అప్పుడు నేను చూసేందుకు వెళ్లాను. ఆయన జీవిత చరిత్రను రాసేందుకు మాట్లాడవలసిందిగా చాలాసేపు అడిగాను. అప్పటికే బలహీనంగా ఉన్నారు. ఆరోగ్యం క్షీణించింది. అందుకనే తర్వాతచూద్దాంలే అని సున్నితంగా తిరస్కరించారు. ఆయన జీవితాంతం ప్రచారానికి దూరంగా ఉన్నారు.

(రాఘవాచారి మూడవ వర్ధంతి సందర్భంగా)

పారదర్శకత లేని తపాలాశాఖ

ఐ-మెయిల్

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న తపాలాశాఖ వారు గతంలో కేవలం ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, పార్సిల్స్ బట్వాడా చేసేవారు. ప్రస్తుతం పై సేవలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అభివృద్ధి పరిచే దిశలో భాగంగా "ఇండియా పోస్ట్ పేమెంట్‌బ్యాంక్" స్థాపించారు.ఈ బ్యాంక్‌లో ఖాతా తెరిస్తే బ్యాంక్ పాస్‌బుక్ ఇవ్వకపోవడం విచిత్రం. కేవలం ఒక వర్చువల్ కార్డు చేతిలో పెట్టి చేతులు దులుపుకోవడం జరుగుతుంది. ఈ బ్యాంక్ ద్వారానే పొదుపు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేకరిస్తారు. నూతనంగా ఈ పేమెంట్ బ్యాంక్ టాటా ఏఐజీ భీమా సంస్థతో ఒప్పందం చేసుకొని బ్యాంక్ ఖాతా దారులు 399 రూపాయలు కడితే 10 లక్షల రూపాయల ప్రమాద బీమా లభిస్తుంది. ఈ ప్రమాద బీమా వర్తింపు చేయడంతో పాటు పాలసీ దారుడు మరణించినను, శాశ్వత అంగవైకల్యం, పాక్షిక అంగ వైకల్యం పొందినను వైద్య ఖర్చుల నిమిత్తం 60,000రూపాయలు, ప్రమాద వైద్యఖర్చులు క్రింద 30,000 రూపాయలు, వారసుల విద్యఖర్చుల నిమిత్తం లక్ష, ఆసుపత్రిలో రోజువారీ ఖర్చులక్రింద 1,000 రూపాయల బీమా సౌకర్యాన్ని 18 నుంచి 65సంవత్సరాల వారికి ఈ సౌకర్యం లభిస్తుంది. కానీ బీమాప్రీమియం 399రూపాయలు చెల్లించిన తరువాత పాలసీ దారుల మొబైల్ ఫోన్‌కు మెసేజ్ వస్తుందని అది ఫోన్‌లో సేవ్ చేసుకోండి అని అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది చదువురాని వారు, కనీసం సంతకం చేయలేని వారు ఉన్నందున ఖాతాదారుడు మరణిస్తే చదువు రాని అతను అతని వారసులకు ఈ బీమాగురించి తెలియని పరిస్థితి నెలకొనిఉంది. బీమా నగదు వారసులు పొందాలంటే ఎటువంటి ఆధారాలు లేకపోవడం విచిత్రం. ఈ ప్రమాద బీమా తీసుకున్న పాలసీ దారునికి ఏ విధంగా జీవిత బీమా, ఆరోగ్య బీమా సంస్థలు "బీమా పాలసీ పట్టా" అందజేస్తున్నారో అదే విధంగా బ్యాంక్ పాస్‌బుక్‌తో పాటు బీమాపాలసీ పట్టా అందజేయవలసిన భాద్యత అధికారులపై ఉంది. దీనివల్ల పారదర్శకంగా ఈ పాలసీ అమలు కావడంతో తపాలాశాఖపై పల్లె వాసులకు నమ్మకం ఏర్పడి ఈ బీమా వర్తింపు కోసం ప్రజలే ముందుకు వస్తారు.

ఆళవందార్ వేణుమాధవ్

పంచభూతాలపై సైన్సు సంస్థల సదస్సా..!

డెహ్రాడూన్ నగరంలో నవంబరు 5 నుంచి 7వ తేదీ వరకు అంతరిక్ష పరిశోధనా సంస్థ, బయోటెక్నాలజీ, వివిధ ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగాల ఆధ్వర్యంలో "ఆకాశ్ తత్వ" సదస్సును నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సదస్సు ముఖ్య పత్రం పేర్కొన్న ప్రధాన అంశాలు విస్మయాన్ని కల్గిస్తున్నాయి.

మన విశ్వం సృష్టికి, సర్వజీవరాశి పుట్టుకకు, మనుగడకు పంచ మహా భూతాలైన నీరు, భూమి, అగ్ని, వాయువు, ఆకాశం మూలమని పేర్కొంటూ నూతన శాస్త్ర సాంకేతిక రంగాలకు 'ఆత్మ'గా నున్న వీటి విశిష్టతను తెలియ జెప్పటమని పేర్కొన్నారు. హేతువు ఆధారంగా వివిధ శాస్త్ర పరిశోధనలతో సాగుతూ జఠిలమైన కోవిడ్ వ్యాధికి వాక్సిన్లు, క్వాంటమ్, సూపర్ కంప్యూటర్ల ఆవిష్కరణలతో మానవ సంక్షేమానికి ఎంతో కృషిచేస్తున్న నూతన సైన్సుకు కాషాయరంగు పులిమి దానిని అవమానించడానికి ఈ సదస్సు నిర్వహణ అంతర్యం. సైన్సు విద్యార్థుల్లో ప్రశ్నించే అలవాటుని హరించి, వారి మెదళ్లలో బూజుపట్టిన అశాస్త్రీయ కల్పిత గాథలను చొప్పించి సైన్సు అభివృద్ధికి ఆటంకం కలిగించే చర్యగా దీనిని పేర్కొనాలి.సదస్సు ముఖ్య పత్రంలో పేర్కొన్నట్లు పంచభూతాలు విశ్వవ్యాప్తమని, దీని ఆధారంగానే దాని ఉనికి, చలనం కొనసాగు తున్నదనడం అసత్యం. అలాగే సర్వ విశ్వం 'ఆకాశ్''(ఆత్మ)తో కూడిన పరమాణువు లతో నిర్మితమైనది అవాస్తవం. చాలా నక్షత్రాల్లో, గ్రహాల్లో నీరు, వాయువు వంటివి లేవని, శాస్త్ర పరిశోధనలకు ఇంకా అంతుబట్టని ఎన్నో ఇతర మూలకాలు వాటిలో ఉండవచ్చని నేడు శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. అదేవిధంగా పదార్థానికి అతి సూక్ష్మమైనది పరమాణువు కాదని, ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లు కంటే అతి సూక్ష్మమైన 'క్యూబిట్లు"ను ప్రస్తుతం కనుగొన్నారు. విశేషమేమంటే ఒక సమయంలో "పాజిటివ్", "నెగెటివ్" చార్జీలను కలిగి ఉండటం వీటి ప్రత్యేకత. కనుకనే వీటిని ప్రస్తుతం 'క్వాంటమ్ కంప్యూటర్లలో'' వినియోగిస్తున్నారు. పంచభూతాల్లో ఐదవదైన 'ఈథర్''(లేక "ఆకాశ్") అతి తేలికైనది, ఆత్మకు ప్రతి రూపంగా అన్ని ఖాళీ స్థలాలను (రసాయన బాండ్ల నుండి, ప్రోటీన్ల మధ్య మానవ శరీరాన్ని, వివిధ గ్రహాల మధ్య ఖాళీ స్థలాల్ని ఆక్రమించుతుందని, ఎలక్ట్రో మేగ్నటిక్ తరంగాలను పోలిన దీని కాంతివంతమైన తేజస్సుతోనే విశ్వం యావత్తు తన ఉనికిని, చలనాన్ని కలిగి ఉంటుందని ఈ సదస్సు ముఖ్యపత్రం పేర్కొంటున్నది. అతి తేలికైన, విశ్వవ్యాప్తమైన ఈ "ఆకాశ్" మూలకాన్ని ఇప్పటివరకు కనుగొనలేదు. మెండలీన్ మూలకాల పట్టికలో దీనికి స్థానంలేదు. చెవి వినికిడి ద్వారా, మానవ స్పర్శ ద్వారా, వివిధ యోగాసనాల ద్వారా (శవాసనం, సింహాసనం వగైరాల ద్వారా) కంఠచక్రంలో నుండే "ఆకాశ్" ను ఉత్తేజ పర్చవచ్చని పేర్కొనడం పూర్తిగా అశాస్త్రీయం. విశ్వంలో ఎన్నో నక్షత్రాలు, గ్రహాలున్నాయి. ఇవి మనిషి పుట్టటానికి కొన్ని బిలియను కాంతి సంవత్సరాల క్రితమే ఉనికిలోకి వచ్చాయి. మానవ ఆత్మ, స్పర్శకు భిన్నంగా అవి కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో మానవజాతి అంతరించినా ఇంకా ఉంటూనే ఉంటాయి. వీటి ఉనికి, నిర్మాణం మానవ భావాలు, స్పర్శ, వినికిడి, ఆత్మకు అతీతం. ఈ భావవాద భావన హేతువుకి భిన్నమైనది, అశాస్త్రీయమైనవి.

హేతుబద్ధమైన ప్రాచీన భారత పరిశోధనలు: ప్రముఖ చరిత్రకారుడు శ్రీ దేవి ప్రసాద్ చటోపాధ్యాయ పేర్కొన్నట్లు అనాదిగా మానవ నాగరికతలో భావవాద, మితవాద ధోరణలు, వాటికి సమాంతరంగా హేతువుతో కూడిన పదార్థవాద భావనలు కొనసాగుతూ వస్తున్నాయి అని పేర్కొంటారు. ప్రాచీన మానవుడు తన చుట్టూ ఉన్న ప్రకృతిని, ఆకాశాన్ని, నక్షత్ర గ్రహాలను, మానవ శరీర నిర్మాణాల్ని, నిశితంగా పరిశీలించేవాడు. కొందరు శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేసి కొన్ని ఆవిష్కరణలను సైతం చేశారు. ఆర్యభట్టు, వరాహమిహురుడు, భాస్కరుడు, తెలుగు శాస్త్రవేత్త పావులూరి మల్లన్న తదితరులు గణితం, రేఖాశాస్త్రం(జియోమెట్రి) రసాయన, ఖగోళ, ఆయుర్వేద తదితర శాస్త్రాల్లో నిష్ణాతులు. వివిధ గ్రహాల మధ్య దూరాన్ని, భూమికి సూర్యునికి మధ్య దూరాన్ని, సున్నా, ఆల్జీబ్రాలను కొనుగొని సంక్లిష్టమైన అనేక సమస్యలకు సమాధానాలు ఇవ్వగలిగారు. శుశ్రుతుడు వంటి శాస్త్రవేత్తలు మానవ శరీర నిర్మాణాన్ని అధ్యయనం చేసే ఆయుర్వేదాన్ని అభివృద్ధి చేశారు. అదే సమయంలో విదేశాల్లో ఈజిప్టు, బాబిలోనియా, గ్రీసు, చైనా నాగరికతలతో ఘనంగా పోల్చదగినవి మన నాగరికతలు, ఈ పురాతన పరిశోధనలు హేతువు ఆధారంగా ఆవిష్కరింపబడినవి గావున వీటిని నేటికీ ఆధారాల సహాయంతో నూతన శాస్త్ర సాంకేతికత గుర్తించగలుగుతున్నది. హేతుబద్ధమైన ఆధారాలతో కూడిన తరహా సైన్సు ఆవిష్కరణల పట్ల మనకు అపారమైన గౌరవం ఉంది. గర్విస్తాం.

చరిత్ర వక్రభాష్యం: కాగా ఈనాడు మితవాద ఆర్‌ఎస్‌ఎస్ చరిత్రకారులు చరిత్రను వక్రీకరిస్తున్నారు. ఏనుగు పేడ, గోమూత్రం, మంత్ర ఉచ్చారణలతో పుష్పక విమానాలను నడపగలిగారని, "ఆకాశ్" మూలకం తేజస్సుతో జనించే ఎలక్ట్రో మేగ్నటిక్ తరాంగాలు జియోమేగ్నటిక్ తరంగాలు (వీటిని కొందరు మరింత ముందుకెళ్లి "మోదీ తరంగాలుగా" వ్యవహరిస్తున్నారు). వీటి ఉనికి కారణంగా విశ్వం యావత్తు తన ఉనికిని కలిగిఉందని జవాబిస్తున్నారు. నేడు 'క్యూబిట్ల" తో నిర్మితమైన క్వాంటమ్ సూపర్ కంప్యూటర్లు, డిఎన్ఏ ఆధారిత పంటలు, ఔషధాలు, కొవిడ్ మహమ్మారినిసైతం వారించగల్గిన వాక్సిన్లు ఆవిష్కరణలతో సైన్సు ఎన్నో దైనందిన సమస్యలకు పరిష్కారాలు కనుగొని మానవ కళ్యాణానికి తోడ్పడుతున్నది. ఇలాంటి అధునాతన సైన్సు పరిశోధనలకు బూజుపట్టిన, కల్పిత, అశాస్త్రీయ, "ప్రాచీన శాస్త్ర ఘనకీర్తి"ని అంటకట్టి అవమాన పరుస్తున్నారు. సైన్సు విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని, ఉత్సుకతను హరించి, వారి మెదళ్లలో అశాస్త్రీయ ఆలోచనలను నింపడం ద్వారా సైన్సు అభివృద్ధిని, సమాజప్రగతిని నిరోధించి విదేశీ బహుళజాతి కంపెనీల ఆధీనంలోకి దేశాన్ని పూర్తిగా నెట్టివేసే ప్రయత్నమే "ఆకాశ్" సదస్సు నిర్వహణ ముఖ్యోద్దేశం. అశాస్త్రీయమైన ఈ సదస్సు నిర్వహణ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వంపై ప్రజలు ఒత్తిడి చేయాలి.

డా. సోమ మర్ల, ప్రధాన శాస్త్రవేత్త, జీనోమిక్స్, రిటైర్డ్ ఐసీఏఆర్, న్యూఢిల్లీ

మద్దతు ధర కోసం రోడ్డెక్కిన చెరకు రైతు

టన్నుకు రూ.3,100 కోసం డిమాండు

ఫ్యాక్టరీల వాహనాల టైర్లలో గాలితీసేసి నిరసన

పూనే: మద్దతు ధర కోసం మహారాష్ట్రలో చెరకు రైతు పోరాటబాటపట్టాడు. తమ ఆందోళనను పట్టించుకోకుండా ఉంటే ఉధృతం చేస్తామనీ, పరిస్థితి చేయి దాటకముందే సమస్యను పరిష్కరించాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి చక్కెర రైతులు తేల్చిచెప్పారు. చక్కెర పంటకు అధిక ధర కోసం సోలాపూర్ జిల్లా చక్కెర మద్దతు ధర ఉద్యమ కమిటీ బ్యానర్ కింద అనేక రైతు సంఘాలు నిరసనకు దిగాయి. పంటను చక్కెర ఫ్యాక్టరీలకు తరలించే వాహనాల టైర్లలో గాలి తీసేసి రైతులు తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని స్థానిక యంత్రాంగాన్నీ, రాష్ట్ర ప్రభుత్వాన్నీ డిమాండు చేశారు. తమ ఆందోళనను నిర్లక్ష్యం చేయడం తగదని హెచ్చరించారు. పంట దిగుబడిని పొలం నుంచి ఫ్యాక్టరీలకు తరలించే వాహనదారులపై ఒత్తిడిని మిల్లుల యజమానులు పెంచుతున్న క్రమంలో అసహనానికి గురై టైర్లలో గాలి తీసేశారని పంధార్పూర్ గ్రామీణ పోలీసుస్టేషన్ ఇనస్పెక్టర్ ధనుంజయ్ జాదవ్ గురువారం తెలిపారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి సోలాపూర్‌లోని వఖారి వద్ద 11 ట్రాక్టర్-ట్రాలీల టైర్లలో గాలి తీసేశారన్నారు. ఈ వ్యవహారంలో ట్రాక్టర్ యజమానుల నుంచి ఫిర్యాదులు రాలేదని చెప్పారు. అయితే ప్రస్తుతం టన్ను చక్కెరకు రూ.2,100 నుంచి రూ.2,300 ధర ఇస్తుండగా దానిని రూ.3,100కు పెంచాలని అన్నదాతలు డిమాండు చేస్తున్నారు. పొలాల నుంచి చక్కెర మిల్లులకు సరకు రవాణా చేయొద్దు అని వాహనదారులకు రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. 'సోలాపూర్ జిల్లాలో 20వేల మంది చక్కెర రైతులు ఇటీవల సమావేశాన్ని నిర్వహించి టన్నుకు రూ.3,100 ధర డిమాండు చేయాలని నిర్ణయించారు. మొదటి విడతగా రూ.2,500 ఇచ్చి మిగతా రూ.600 తుది బిల్లు సమయానికి అందించవచ్చు అని స్వాభిమాని శేట్కరి సంఘటన (రైతుల అనుబంధ సంఘం) సభ్యుడు సచిన్ పాటిల్ తెలిపారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఎరువుల ధరల కారణంగా సాగువ్యయం విపరీతంగా పెరిగి రైతన్న తల్లడిల్లిపోతున్నాడని, పంటకు తగిన ధర రాకపోవడం దారుణమని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితి చేయదాటకముందే స్పందించి రైతుల డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులకు స్పష్టంచేశారు. స్థానిక, ప్రభుత్వ అధికారులు వెంటనే నిరసనకారులను కలిసి పరిష్కారానికి కృషిచేయాలని పాటిల్ సూచించారు.

దిల్లీని చెత్తకుప్పగా మార్చేశారు...

కాషాయ పాలకులపై కేజ్రీవాల్ ధ్వజం

న్యూదిల్లీ: దిల్లీని బీజేపీ చెత్తకుప్పగా మార్చేసిందంటూ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. యూపీలోని ఘజీపూర్ డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన ఆయన కాషాయ పార్టీ లక్ష్యంగా దుమ్మెత్తిపోశారు. దిల్లీని మురికికూపంగా మార్చి చెత్త నింపడం మినహా రాజధానికి బీజేపీ చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. ప్రజలంతా ఈ విషయం ఆలోచించాలని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) ఎన్నికలకు ముందు దిల్లీలోని అతిపెద్ద డంపింగ్ యార్డ్‌లలో ఒకటైన ఘజీపూర్ ప్రాంతంలోని గార్బేజ్ డంప్‌ను సందర్శించారు. దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ పాలనను కేజ్రీవాల్ తప్పుబడుతూ... దిల్లీలో ప్రతిచోటా చెత్తను వేయడం తప్ప కాషాయ పాలకులు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఘజీపూర్‌లో పేరుకున్న చెత్త పర్వతాన్ని చూసేందుకు తాను ఇక్కడికి వచ్చానని అన్నారు. బీజేపీ మురికి పార్టీ అని, ఆప్ స్వచ్ఛమైన పార్టీ అని ఏదో ఓ రోజు సంబిట్ పాత్రా చెబుతారని, బీజేపీ కార్యకర్తలంతా ఆప్‌లో చేరే రోజు కూడా రానుందని కేజ్రీవాల్ జోస్యం చెప్పారు. తాను మెజీషియన్ అని, ప్రజల హృదయాలను గెలుచుకోవడం ఎలాగో తనకు తెలుసునని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జీరో అయిందని, ఏదోఒకరోజు బీజేపీ కూడా జీరో కానుందని అన్నారు. ఈ ఏడాది చివరిలో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో ఎంసీడీ ఎన్నికలు జరగనున్నాయి.

ఖట్టర్ హయాంలో హరియాణా సర్వతోముఖాభివృద్ధి: అమిత్‌షా

ఫరీదాబాద్: హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం ప్రశంసలు కురిపించారు. చాలాకాలం తర్వాత రాష్ట్రానికి సర్వతోముఖాభివృద్ధికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి లభించారని అన్నారు. గతంలో పనిచేసిన ముఖ్యమంత్రులు ప్రాంతీయ పక్షపాతంతో వ్యవహరించారని విమర్శించారు. హరియాణా ఆర్బిటల్ రైల్ కారిడార్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం మరో మూడు ప్రాజెక్టులను ప్రారంభించిన షా... ఇక్కడ జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో గత పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూపీందర్ సింగ్ హుడా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. అదే సమయంలో ఓం ప్రకాష్ చౌతాలా నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ లోక్ దళ్ పాలనపై కూడా పరోక్షంగా విమర్శలు గుప్పించారు. హుడా ప్రాంతీయ పక్షపాతంతో రోహ్‌తక్‌లో అభివృద్ధి పనులపై కేంద్రీకరించారని రాష్ట్రంలోని బీజేపీ నేతలు తరచూ ఆరోపిస్తున్నారు. ఖట్టర్ ప్రభుత్వం ఎనిమిదేళ్లలో హరియాణా రూపురేఖలు మార్చడానికి కృషి చేసిందని అమిత్‌షా అన్నారు.

ఆలస్యంగా క్యాబ్...

ఊబర్‌కు రూ.20 వేల జరిమానా

ముంబై: క్యాబ్ డ్రైవర్ ఆలస్యం వల్ల విమానం వెళ్లిపోయినట్టు ఓ మహిళ కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించారు. ఆ కేసులో ముంబైలోని కోర్టు ఊబర్ ఇండియా సంస్థకు రూ.20 వేల జరిమానా విధించింది. డోంబివ్లికి చెందిన అడ్వకేట్ కవితా శర్మ 2018 నుంచి ఈ కేసులో పోరాటం చేస్తోంది. ఆ ఏడాది జూన్‌లో చెన్నైకి ఆమె విమాన టికెట్‌ను బుక్ చేసుకుంది. అయితే క్యాబ్ డ్రైవర్ ఆలస్యంగా రావడమే కాకుండా... విమానాశ్రయానికి రాంగ్ రూట్లో వెళ్లాడు. ఫోన్ కాల్ మాట్లాడుతున్న ఆ డ్రైవర్ రాంగ్ టర్న్ తీసుకున్నాడని ఆమె తన ఫిర్యాదులో ఆరోపించారు. దాని వల్ల సుమారు 20 నిమిషాలు ఆలస్యమైందన్నారు. విమానాశ్రయానికి చేరుకొనే సమయానికి ఆమె ఎక్కాల్సిన విమానం వెళ్లిపోయింది. అంతేకాకుండా బుకింగ్ టైమ్‌లో చూపించిన బిల్లు కన్నా ఎక్కువే ఆమె నుంచి వసూల్ చేశారు. ఈ కేసులో ముంబై అడ్వకేట్ తొలుత లీగల్ నోటీసులు జారీ చేశారు. కానీ ఊబర్ ఇండియా స్పందించలేదు. దీంతో ఆమె థానే జిల్లా కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన కోర్టు అడ్వకేట్ శర్మకు రూ.20 వేలు చెల్లించాలని ఊబర్ ఇండియా సంస్థను ఆదేశించింది.

తమిళనాట కేరళ మోడల్

37 పంచాయతీల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టుకు చర్యలు

త్రిస్సూర్ : కేరళ త్రిస్సూర్ జిల్లాలోని పెరింజనం సౌరవిద్యుత్ ప్రాజెక్టు తమకు ఆదర్శమని తమిళనాడుకు చెందిన 37 పంచాయతీల అధ్యక్షులు తెలిపారు. తమ పంచాయతీల్లోనూ సౌరవిద్యుత్ ఉత్పత్తికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. తమిళనాడులో తరచూ విద్యుత్ కోతలు సమస్యగా ఉందని, పెరుగుతున్న ధరల క్రమంలో నిరంతరాయ సరఫరా సవాల్‌గా మారిందని చెప్పారు. కేరళలో అనుసరిస్తున్న ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తి నమూనాను తామూ అమలు చేస్తామన్నారు. సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు పంచాయతీల అధ్యక్షులు, స్థానిక సంఘాల అధికారులతో కలిపి 45 మంది తమిళనాడు నుంచి కేరళకు వచ్చి ఇళ్ల పైకప్పులపై ఏర్పాటు చేసిన సౌరవిద్యుత్ ప్లాంట్లను పరిశీలించారు. స్థానికుల కృషిని తమిళనాడులోని ఒడంధురై గ్రామ పంచాయతీ అధ్యక్షుడు పి.తంకవేల్ మెచ్చుకున్నారు. సాగు కోసం పంపులకు విద్యుత్ సరఫరా కష్టమైందని, సౌరవిద్యుత్ ప్రాజెక్టు వల్ల ఈ సమస్య పరిష్కారం అవుతుందన్న ఆశాభావాన్ని 37 పంచాయతీల ప్రతినిధులు వ్యక్తంచేశారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ 2019, సెప్టెంబరు 23న పెరింజనంలో 500కిలోవాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఏటా డిమాండుకు తగ్గట్లు ఉత్పత్తి పెరుగుతోంది. ప్రస్తుతం 1.16ఎండబ్ల్యూ విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. సౌర విద్యుత్ వినియోగం క్రమంలో 127 కుటుంబాల విద్యుత్ బిల్లులు రూ.90వేల నుంచి రూ.30వేలకు తగ్గింది. కర్బన ఉద్గారాలు 1.92లక్షల కేజీలకు క్షీణించింది. 9.5కిలోవాట్ల సౌరవిద్యుత్ కేంద్రాన్ని స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేశారు. సౌర విద్యుత్‌తోనే 750 వీధి దీపాలు (ఎల్ఈడీలు) వెలుగుతున్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలను 11 మంది సభ్యులతో కుడుంబశ్రీ యూనిట్ చూసుకుంటోంది.

వడోదరలో రవాణా విమానాల తయారీ కేంద్రం

న్యూదిల్లీ: గుజరాత్‌లోని వడోదరలో ఎయిర్‌బస్ సీ295 రవాణా విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రక్షణ శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ గురువారం తెలిపారు. ఈ కేంద్రానికి అక్టోబరు 30న శంకుస్థాపన జరుగుతుందని, దీనికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారని పేర్కొన్నారు. మొదటిసారిగా సి-295 విమానం యూరప్ వెలుపల తయారవుతోందని కుమార్ చెప్పారు. గత ఏడాది సెప్టెంబర్‌లో, భారతదేశంలో సైనిక విమానాల తయారీకి సంబంధించిన ప్రాజెక్ట్ కింద భారత వాయుసేన (ఐఏఎఫ్)లోని కాలం చెల్లిన అవ్రో-748 విమానాల స్థానంలో 56 సి-295 రవాణా విమానాలను కొనుగోలు చేయడానికి భారత ప్రభుత్వం మొదటిసారి ఓ ప్రైవేటు కంపెనీ 'ఎయిర్‌బస్ డిఫెన్స్‌అండ్ స్పేస్'తో దాదాపు రూ.21వేల కోట్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం... ఎయిర్‌బస్ నాలుగు సంవత్సరాలలో స్పెయిన్‌లోని సెవిల్లేలోని తమ చివరి అసెంబ్లీ లైన్ నుంచి ప్రయాణించడానికి సిద్ధంగా ఉన్న స్థితిలో మొదటి 16 విమానాలను అందిస్తుంది. తదుపరి 40 విమానాలను రెండు కంపెనీల మధ్య పారిశ్రామిక భాగస్వామ్యంలో భాగంగా భారత్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్) తయారు చేసి అసెంబుల్ చేస్తుంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ (డీజీఏక్యూఏ) గత వారంలో ఆమోదం తెలిపింది.

నిన్ను చూస్తుంటే గర్వంగా ఉందమ్మా

ప్రియాంక గాంధీ భావోద్వేగ పోస్టు



న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా సోనియాగాంధీ వైదొలగడంపై ప్రియాంక గాంధీ వాద్రా స్పందించారు. ఈ మేరకు తల్లిని ఉద్దేశిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. "నిన్ను చూస్తే గర్వంగా ఉందమ్మా... ప్రపంచం ఏమనుకున్నా, ఏం ఆలోచించినా సరే... నాకు తెలుసు ఇదంతా నువ్వు కేవలం ప్రేమ కోసమే చేశావని" అంటూ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. దీంతో పాటు... ఖడ్గే బహూకరించిన చిత్రాన్ని చూపిస్తున్న సోనియా ఫొటోను పంచుకున్నారు. ప్రస్తుతం ప్రియాంక పోస్టు నెట్టింట వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా, సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఉన్న సోనియా గాంధీ ఆ పదవి నుంచి వైదొలగడంతో ఇటీవల జరిగిన ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా మల్లికార్జున ఖడ్గే విజయం సాధించారు. గత 24 ఏళ్లల్లో గాంధీ కుటుంబేతర వ్యక్తి పార్టీ పగ్గాలు చేపట్టడం ఇదే తొలిసారి. సోనియాగాంధీ నుంచి బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఖడ్గే సోనియాకు రాజీవ్ గాంధీ చిత్రాన్ని బహూకరించారు.

రసగుల్లా అయిపోయిందని ఘర్షణ...వ్యక్తి మృతి

ఆగ్రా: ఓ పెళ్లి వేడుకలో రసగుల్లాలు అయిపోవడంపై జరిగిన రభస... 22 ఏళ్ల యువకుడి హత్యకు దారి తీసింది. ఆగ్రా ఎత్మాద్‌పూర్‌లోని మొహల్లా షైఖాన్ నివాసి ఉస్మాన్ కుమార్తె వివాహ వేడుకలో బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. రసగుల్లాలు అయిపోయాయని వధువు, వరుడి పక్షాల మధ్య మొదలైన వాగ్వాదం రెండు పక్షాల మధ్య ఘర్షణగా మారింది. ఎత్మాద్‌పూర్ సర్కిల్ ఆఫీసర్ రవికుమార్ గుప్తా పీటీఐతో మాట్లాడుతూ... 'మిఠాయి కొరతపై జరిగిన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. దీంతో ఓ వ్యక్తి హాజరైన కొందరిపై కత్తితో దాడి చేశాడు' అని వివరించారు. దాడిలో తీవ్రంగా గాయపడిన సన్నీ (22)ని మొదట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పంపారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఆగ్రాలోని సరోజిని నాయుడు మెడికల్ కాలేజీకి తరలించారు. అక్కడ అతడు చికిత్స పొందుతూ మరణించినట్లు గుప్తా పేర్కొన్నారు. దాడిలో గాయపడిన ఐదుగురిని ఎత్మాద్‌పూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని గుప్తా అన్నారు.

లాలూ బీహార్ పర్యటన ఇప్పట్లో లేనట్లే!

పాట్నా: రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ లాలూ ప్రసాద్ సింగపూర్ నుంచి తిరిగొచ్చారు. కిడ్నీ సమస్యల చికిత్స కోసం ఈ నెల ప్రారంభంలో ఆయన సింగపూర్‌కు వెళ్లారు. అయితే ఆయన మరికొంతకాలం ఆయన సొంత రాష్ట్రం బీహార్ రాజకీయాలకు దూరంగా ఉండొచ్చు. తన తండ్రి ఆరోగ్యమే కుటుంబానికి ముఖ్యమని, ఇతర విషయాల కోసం వేచి ఉండవచ్చని లాలూ పెద్ద కుమార్తె మిసా భారతి స్పష్టం చేశారు. తండ్రి దిల్లీ వచ్చినప్పుడల్లా మిసా ఆయన్ను అంటిపెట్టుకుని ఉంటారు. 'ఆయనకు అనేక పరీక్షలు చేయమని వైద్యులు సూచించారు...వాటిలో చాలా వరకు భారతదేశంలో జరుగుతాయి... మేము వీటిని వరుసలో ఉంచుతున్నాం... తదుపరి చర్య కోసం సింగపూర్‌లోని వైద్య నిపుణులతో సంప్రదింపులు జరుపుతాం' అని భారతి చెప్పారు. ఆర్జేడీ బీహార్‌లోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలను ఎదుర్కొంటున్న తరుణంలో సొంత రాష్ట్రానికి వస్తారా అని అడగ్గా... 'ఆయన ఇప్పుడే పాట్నా రారు. ఇక్కడే (దిల్లీ) ఉండి విశ్రాంతి తీసుకోవాలి ఇతర వైద్య సలహాలను పాటించాలి' అని రాజ్యసభ సభ్యురాలు కూడా అయిన భారతి పేర్కొన్నారు.

వివాహితను ఇంటి పని చేయమనడం క్రూరత్వం కాదు : బాంబే హైకోర్టు

ముంబై: కుటుంబం కోసం ఇంటి పనిచేయమని అడిగితే అది క్రూరత్వం కాదని, దానిని పనిమనిషి పనిత పోల్చలేమని బాంబై హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ స్పష్టం చేసింది. గృహహింసకు పాల్పడ్డారని, క్రూరంగా ప్రవర్తించారంటూ ఓ మహిళ... తన విడిపోయిన భర్త, అతని తల్లిదండ్రులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. పెళ్లయిన తర్వాత నెల రోజుల పాటు తనతో సక్రమంగా వ్యవహరించారని, అయితే ఆ తర్వాత తనతో పనిమనిషిలా వ్యవహరించడం ప్రారంభించారని ఆ మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. వివాహమైన ఒక నెల తర్వాత తన భర్త, అతని తల్లిదండ్రులు కారు కొనడానికి రూ.4 లక్షలు డిమాండ్ చేయడం ప్రారంభించారని ఆమె పేర్కొంది. ఈ డిమాండ్‌పై భర్త తనను మానసికంగా, శారీరకంగా వేధించాడని ఆ మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. అయితే మహిళ కేవలం వేధింపులకు గురైనట్లు పేర్కొన్నారే కానీ తన ఫిర్యాదులో అటువంటి చర్యను వివరించలేదని హైకోర్టు పేర్కొంది. "పెళ్లయిన స్త్రీని కుటుంబ అవసరాల కోసం ఇంటిపని చేయమని అడిగితేఅది పనిమనిషి లాంటిదని చెప్పలేము. ఆమెకు తన ఇంటి పనులు చేయాలనే కోరిక లేకుంటే, పెళ్లికి ముందే చెప్పాలి. తద్వారా వరుడు పెళ్లి గురించి పునరాలోచించవచ్చు లేదా వివాహం తర్వాత అయితే, అలాంటి సమస్యను ముందుగానే పరిష్కరించుకోవాలి" అని కోర్టు తెలిపింది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 498ఎ ని అమలు చేయడానికి అటువంటి చర్యలను వివరించనంత వరకు 'మానసికంగా, శారీరకంగా వేధింపులు' పదాలను ఉపయోగించడం సరిపోదని పేర్కొంది. మహిళ నిందితులుగా పేర్కొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను న్యాయమూర్తులు విభా కంకన్‌వాడి, రాజేష్ పాటిల్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబరు 21న రద్దు చేసింది. కేసును రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ భర్త, అతని తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారణకు అనుమతించింది.

కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాల మూసివేత

డెహ్రాడూన్: శీతాకాలం రీత్యా ఉత్తరాఖండ్‌లోని ఎత్తైన గర్వాల్ హిమాలయాల్లో ఉండే కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాలను గురువారం మూసివేశారు. ఉదయం 8.30 గంటలకు వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక ప్రార్థనలు చేసిన తర్వాత ఆలయ తలుపులు మూసివేసినట్లు బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అజేంద్ర అజయ్, తీర్థపురోహిత్, రుద్రప్రయాగ్ జిల్లా అధికారులతో పాటు 3వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. భారత సైన్యానికి చెందిన 11వ మరాఠా రెజిమెంట్ భక్తి బాణీలు వాయించారు. ఈ ఏడాది 43 లక్షల మంది యాత్రికులు ఈ ఆలయాలకు చేరుకున్నారు. ఒక్క కేదార్‌నాథ్‌లోనే 15,61,882 మంది భక్తులు ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ మీడియా ఇన్‌చార్జి డాక్టర్ హరీష్ గౌర్ మాట్లాడుతూ... కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన ద్వారాన్ని తెల్లవారుజామున 3 గంటలకు తెరిచామని, శీతాకాలం కోసం తలుపులు మూసివేసే ప్రక్రియ తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమైందని తెలిపారు. ప్రత్యేక పూజలనంతరం మధ్యాహ్నం 12:09 గంటలకు ఉత్తరకాశీ జిల్లాలోని యమునోత్రి ఆలయ ప్రధాన ద్వారం కూడా మూసివేసినట్లు యమునోత్రి ఆలయ కమిటీ కార్యదర్శి సురేష్ ఉనియాల్ తెలిపారు. ఈ సందర్భంగా 2వేలమంది భక్తులు హాజరయ్యారు. వారు డప్పులు వాయిస్తూ తాండి నృత్యం (ఉత్తరాఖండ్ జానపద నృత్యం) కూడా ప్రదర్శించారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి యాత్రికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసారి రికార్డు స్థాయిలో యాత్రికులు ఈ పుణ్యక్షేత్రాలకు చేరుకున్నారని చెప్పారు. ఇటీవలే ప్రధాని మోదీ... గౌరీకుండ్-కేదార్‌నాథ్ రోప్‌వేకి శంకుస్థాపన చేశారని, దీని నిర్మాణం కేదార్‌నాథ్ యాత్రను సులభతరం చేస్తుందని ధామి చెప్పారు. మంచు కారణంగా ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ ప్రాంతంలో ఉన్న కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి అనే నాలుగు హిమాలయ దేవాలయాల(చార్‌ధామ్)ను శీతాకాలం మూసి వేస్తారు. ఏటా ఆరు నెలలు మాత్రమే ఈ ఆలయాలను తెరుస్తారు. గర్వాల్ ప్రాంతానికి ఆర్థిక వెన్నెముకగా భావించే చార్ధామ్ యాత్రకు ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు వస్తుంటారు.

డాబర్ 'బాద్‌షా'

మసాలా కంపెనీలో 51 శాతం వాటా కొనుగోలు

న్యూదిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్... మసాలాలు, సుగంధ ద్రవ్యాల మార్కెట్లోకి అడుగు పెట్టబోతోంది. బాద్‌షా మసాలా ప్రైవేట్ లిమిటెడ్‌లో 51 శాతం వాటాలను రూ.587.52 కోట్లకు కొనుగోలు చేయనుంది. వచ్చే ఏడాది మార్చికి ఒప్పందం పూర్తి కానుంది. మిగిలిన 49 శాతం వాటాను మరో ఐదేళ్లలో కొనుగోలు చేయనున్నట్లు డాబర్ ఎక్స్ఛేంజీ పేర్కొంది. బాద్‌షా కంపెనీ 1958 నుంచి మసాలాల వ్యాపారంలో ఉంది. బాద్‌షా కంపెనీలో వాటాల కొనుగోలు ద్వారా తమ ఫుడ్‌బిజినెస్‌ను విస్తరించుకోవాలని భావిస్తున్నట్లు డాబర్ ఓ ప్రకటనలో తెలిపింది. డాబర్ ఎఫ్ఎంసీజీ పోర్ట్‌ఫోలియోలో ప్రస్తుతం డాబర్ చవన్‌ప్రాష్, డాబర్ హనీ, డాబర్ ఆమ్లా, డాబర్ రెడ్ పేస్ట్, వాటికా, రియల్ వంటి ఉత్పత్తులు ఉన్నాయి. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక ఫలితాలను డాబర్ ప్రకటించింది. కంపెనీ ఏకీకృత నికర లాభం 2.85 శాతం క్షీణించి రూ.490.86 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.505.31 కోట్ల నికర లాభం నమోదు చేసింది. కంపెనీ ఆదాయం 6 శాతం పెరిగి రూ.2986.49 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.2817.58 కోట్లుగా ఉంది.

ఆ గిడ్డంగిలో ఉద్యోగులంతా మహిళలే!

న్యూదిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని దాద్రీలో తన కొత్త గిడ్డంగిని పూర్తిగా మహిళా ఉద్యోగులతో నడుపుతున్నట్లు ఇంటిగ్రేటెడ్ కంటైనర్ లాజిస్టిక్స్ కంపెనీ ఏపీ మొల్లర్-మార్స్క్ గురువారం వెల్లడించింది. పూర్తిగా మహిళా సిబ్బందితో కూడిన తమ మొదటి గిడ్డంగి ఇదేనని పేర్కొంది. ఈ గిడ్డంగిలో 84మంది మహిళలు పనిచేస్తున్నారు. వీరంతా చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారు. వీరందరికీ కంపెనీ తగు విధంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లో నియమించింది. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ గిడ్డంగి... కంపెనీ కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ (సీఎఫ్ఎస్) ప్రాంగణంలో ఉంది. 'దేశవ్యాప్తంగా మా గిడ్డంగులను ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఎ మహిళలకు అవకాశాలను కల్పించాలని మేము కోరుకున్నాము. 2021 జనాభా లెక్కల ప్రకారం... దాద్రీ మొత్తం జనాభాలో కేవలం ఆరు శాతం మంది మాత్రమే శ్రామిక మహిళలు ఉన్నారు... ఆ విషయంలో మార్పు కోసం దోహదపడాలనే మా ఆకాంక్ష' అని కంపెనీ దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ వికాష్ అగర్వాల్ అన్నారు.

వీధి దీపాల వెలుగులో బాలిక చదువు

ఆమె అంకితభావంపై ప్రశంసల జల్లు

న్యూదిల్లీ: ఒక బాలిక వీధి దీపాల వెలుగులో చదువుతున్నది. స్కూల్ యూనిఫామ్‌లో ఉన్న ఆమె ఫుట్‌పాత్‌పై కూర్చొని సీరియస్‌గా రాసుకుంటున్నది. ఆ రోడ్డున వెళ్లే వాహనాల శబ్దాలను లెక్కచేయక తన చదువుపైనే నిమగ్నమైంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ కొందరు విద్యార్థులు చదువు పట్ల నిర్లక్ష్యం వహిస్తారు. అయితే కనీస సౌకర్యాలు కూడా లేని పేద పిల్లల్లో కొందరు చదువు పట్ల ఆసక్తిని చూపడంతోపాటు అందుబాటులో ఉన్న వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటారు. ఇదే కోవకు చెందిన ఒక పేద బాలిక స్కూల్ తర్వాత ఫుట్‌పాత్‌పైనే చదువుకుంటున్నది. వీధి లైట్ల కాంతి వెలుగులోనే హోంవర్క్ చేస్తున్నది. ఆ రోడ్డున పోయే వాహనాల శబ్దాలు, హారన్ మోతలు ఆమె చదువు దీక్షను భగ్నం చేయలేకపోయాయి. ఒక వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తికి ఇది కనిపించింది. దీంతో తన మొబైల్‌లో దీనిని రికార్డు చేశారు. కాగా, స్టూట్స్ జోన్ 987 అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్ ఈ వీడియోను పోస్ట్ చేశారు. 'నేటి ఉత్తమ వీడియో' అని దానికి శీర్షిక పెట్టారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నెటిజన్లు కూడా బాగా స్పందించారు. చదువు పట్ల ఆ బాలిక శ్రద్ధ, అంకితభావంపై ప్రశంసలు కురిపించారు. ఇలాంటి పిల్లలు తమ భవిష్యత్తుతోపాటు దేశ భవిష్యత్తును ప్రకాశవంతం చేస్తారని కొందరు కొనియాడారు.

ద్వేషపూరిత ప్రసంగం కేసులో ఆజం ఖాన్‌కు మూడేళ్ల జైలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నేత ఆజం ఖాన్‌కు కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ద్వేషపూరిత ప్రసంగం కేసులో ఆయనను దోషిగా గురువారం నిర్ధారించిన కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. రూ.6,000 జరిమానా విధించింది. అయితే వారం రోజుల్లో ఉన్నత కోర్టులో అప్పీల్ కోసం బెయిల్ కూడా మంజూరు చేసింది. దీంతో అప్పీల్‌కు వెళ్లకపోతే జైలు నుంచే ఎమ్మెల్యేగా గెలిచిన ఆజం ఖాన్ అసెంబ్లీ సభ్యత్వాన్ని కోల్పోనున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, అప్పటి జిల్లా కలెక్టర్ ఆంజనేయ కుమార్ సింగ్‌లను ఉద్దేశించి రెచ్చగొట్టేలా ఆయన ప్రసంగించారని ఆరోపణలున్నాయి. దేశంలో ముస్లింల ఉనికికి కష్టతరమైన వాతావరణాన్ని ప్రధాని సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో 2019లో ఆజం ఖాన్‌పై నమోదైన కేసుపై రాంపూర్ కోర్టు విచారణ జరిపింది. ఎట్టకేలకు గురువారం తీర్పు ఇచ్చింది. ఆయనను దోషిగా నిర్ధారించడంతోపాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. కాగా, 2017లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్పీ నేత ఆజం ఖాన్‌పై 90కు పైగా కేసులు నమోదయ్యాయి. భూ ఆక్రమణ కేసులో అరెస్టైన ఆయన రెండేళ్లపాటు జైలులో ఉన్నారు. జైలు నుంచే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఈ ఏడాది మేలో జైలు నుంచి విడుదలయ్యారు. అయితే ద్వేషపూరిత ప్రసంగం కేసులో రాంపూర్ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పుపై హైకోర్టును ఆశ్రయిస్తానని ఆజం ఖాన్ తెలిపారు.

రెడ్‌లైట్ ఆన్.. ఇంజిన్ ఆఫ్

దిల్లీలో కొత్త ట్రాఫిక్ నిబంధనలు

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంటుంది. ఆ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం, అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తుంటారు. దీనికోసం ప్రత్యేకమైన నిర్ణయాలు తీసుకుంటుంటారు. ఇందులో భాగంగానే మరికొన్ని నిబంధనలని రూపొందించారు. మొత్తం 15 అంశాలతో ప్రణాళిక రూపొందించి 'రెడ్ లైట్ ఆన్.. గాడీ ఆఫ్' అనే పేరుతో కొత్త ప్రచారాన్ని దిల్లీ ప్రభుత్వం మొదలు పెట్టింది. కొత్త నిబంధన ప్రకారం ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర రెడ్ లైట్ పడితే.. వెంటనే బండి ఇంజిన్ ఆపేయాలి. గ్రీన్ లైట్ వెలిగితే తప్ప సార్ట్ చేయకూడదు. ప్రతి సిగ్నల్ దగ్గర మూడు వైపులా వాహనాల ఇంజిన్లు ఆపేయడం వల్ల 15 నుంచి 20 శాతం వరకు వాయు కాలుష్యం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిబంధనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. 2,500 మందికిపైగా వలంటీర్లను రంగంలోకి దింపింది. వీరు సిగ్నల్స్ దగ్గర వాహనదారులకు గులాబీలిచ్చి.. వాహనాలు ఆపేయాలని ప్రచారం చేస్తున్నారు. గతంలో సరి-బేసి విధానాన్ని దిల్లీ ప్రభుత్వం అమలు చేసిన విషయం విదితమే.

విద్యుదుత్పత్తిలో మరో ముందడుగు

- ఏపీ జెన్‌కో మూడో యూనిట్ ప్రారంభ సభలో సీఎం జగన్
- భూములిచ్చిన 150 కుటుంబాలకు జెన్‌కోలో ఉద్యోగాలిస్తామని ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో– నెల్లూరు: రాష్ట్రంలో మరో థర్మల్ విద్యుత్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరులోని ఏపీ జెన్‌కో ప్రాంగణంలో దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం మూడోయూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... మూడో యూనిట్ ద్వారా ప్రతి రోజు 19 మిలియన్ యూనిట్ల విద్యుత్ (800 మెగావాట్లు) ఉత్పత్తి అవుతుందని సీఎం జగన్ ప్రకటించారు. ఈ ప్లాంట్ తో అతి తక్కువ ఖర్చు, తక్కువ బొగ్గు వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి చేయపట్టనున్నట్లు తెలిపారు. నిత్యం 19 మిలియన్ యూనిట్ల ఏపీ విదుత్ గ్రిడ్ కు అనుసంధానం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగిందన్నారు. విద్యుత్ ఉత్పత్తి అంశంలో నేడు మరో ముందడుగు పడిందని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన జెన్‌కో మూడో యూనిట్ 800 మెగావాట్ల ప్లాంటు జెన్ కో ఉత్పాదకతలో కీలకంగా నిలవనున్నట్లు పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008లో జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. థర్మల్ ప్లాంట్ కోసం భూములు ఇచ్చిన రైతులను అభినందించిన సీఎం... నిర్వాసితుల కుటుంబాలకు నవంబర్‌లోగా ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లా ప్రజాప్రతినిధులు అడిగిన హామీలకు సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు. రూ. 25 కోట్లతో మిని ఫిషింగ్ హార్బర్ పనులు చేపడుతున్నామన్నారు. పెన్నా నదిపై ముదివర్తి వద్ద రూ.93 కోట్లతో సబ్ మెర్సబుల్ కాజ్ వే నిర్మిస్తామని చెప్పారు. నెల్లూరు బ్యారేజ్‌కు నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేరు పెడుతున్నట్టు ప్రకటించారు. ఉప్పు కాలువ పై హైలెవెల్ బ్రిడ్జిని మంజూరు చేస్తున్నామని, నక్కలవాగుపై రూ.10కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తామని జగన్ హామీ ఇచ్చారు.

12,787 కుటుంబాలకు ప్యాకేజీ అమలు

ప్లాంట్ కోసం నెల్లూరు జిల్లాలో భూములు ఇచ్చిన మొత్తం 12,787 కుటుంబాలకు ప్యాకేజీ అమలు చేసినట్లు సీఎం జగన్ వివరించారు. దీంతో పాటు చంద్రబాబు హయాంలో ప్యాకేజీ ఇవ్వకుండా పెండింగ్ లో ఉన్న మొత్తాన్ని విడుదల చేస్తున్నామన్నారు. ఒకవైపు కృష్ణపట్నం పోర్టు, మరోవైపు థర్మల్ పవర్ ప్లాంటు ఈ రెండింటితో ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలనే అంకురిత దీక్షతో ప్రభుత్వం పనిచేసిందన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన రైతులందరికీ కూడా నిండు మనస్సుతో శిరస్సు వంచి ప్రత్యేకంగా అభివాదం తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. భూములు ఇచ్చిన 326 రైతు కుటుంబాలకు ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చామని, రెండో దశలో మరో 150 కుటుంబాలకు ఉద్యోగాలిచ్చే ప్రక్రియను నవంబర్ లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కృష్ణ పట్నం పోర్టులో మత్స్యకారులకు ప్రయోజనం కల్పించే రూ. 25 కోట్ల వ్యయం కాగల జెట్టీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినట్లు చెప్పారు.

అరెస్టుల పర్వం

సీఎం జగన్ పర్యటన దృష్ట్యా ఉదయం నుంచే పోలీసులు థర్మల్ విద్యుత్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులను, ఐకాస నాయకులను అరెస్టు చేశారు. సీఎం సభను ఏపీ జెన్‌కో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు కార్మికులు నెల్లూరు నగరంలో ప్రదర్శనలు నిర్వహించారు. నల్ల బెలూన్‌లను గాలిలోకి వదిలారు. నిరసన తెలిపిన టీడీపీ, సీపీఎం, సీపీఐ, యువజన విద్యార్థి సంఘాల నాయకులను, కార్యకర్తలను పోలీసులు గురువారం ఎక్కడికక్కడ అరెస్టులు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సీపీఐ నాయకులు దామా అంకయ్య, వి.రామరాజు, సిరాజ్, షాన్‌వాజ్, మున్నా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్, సీపీఎం నాయకులు మోహన్‌రావు, కె.శీనయ్య, ప్రసాద్, గోపాల్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రేవతి, కప్పిర శ్రీనివాసులు, ఎంఎల్ నాయకులు సాగర్, కె రాంబాబు, ఏఐఎఫ్‌టీయూ నాయకుడు యానాదయ్య ఉన్నారు. కాగా సర్వేపల్లి నియోజకవర్గంలో కూడా అనేకమంది నాయకులను గృహనిర్బంధం చేశారు.

ప్రజాస్వామ్యం ఖూనీ: సీపీఐ

జెన్‌కో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలియచేస్తున్న వారిని ప్రభుత్వం

అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ జెన్‌కో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఎం గోబ్యాక్ అంటూ నెల్లూరులోని ముత్తుకూరు గేటువద్ద కార్మికులు నిరసన తెలియజేస్తుండగా పోలీసులు అడ్డుకుని అమానుషంగా వారిని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా దామా అంకయ్య మీడియాతో మాట్లాడుతూ... దామోదరం సంజీవయ్య పవర్‌ప్లాంట్ మూడవ యూనిట్‌ను జాతికి అంకితం చేసినట్లే చేసి, దానిని అదానికి అప్పచెప్పడానికి చేస్తున్న ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏపీ జెన్‌కో ప్రైవేటీకరణపై కేబినెట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ప్రభుత్వరంగం లోనే దీనిని కొనసాగించాలని గత 280 రోజులుగా వామపక్ష పార్టీలు, టీడీపీ, వివిధ కార్మిక సంఘాల నాయకత్వంలో పెద్దఎత్తున నిరసన తెలియచేస్తుంటే తనకు అవేవీ పట్టనట్టు సీఎం వ్యవహరిస్తున్నారన్నారు. కనీసం జెన్‌కో కార్మికులు తమ గోడును వెళ్లబుచ్చేందుకు కూడా సీఎం అవకాశం కల్పించడంలేదని మండిపడ్డారు. జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా జెన్‌కో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని సీఎం దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా జాతికి అంకితం చేసిన ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ధన రాజకీయం... ప్రజాస్వామ్యం ఖూనీ

- కేంద్రం-తెలంగాణలో దుష్టపాలన
- భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ
- రైతు సంఘాల ప్రతినిధులతో భేటీ
- బాధిత రైతు కుటుంబాలకు పరామర్శ

విశాలాంధ్ర – హైదరాబాద్: దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోనూ ధనరాజకీయం జరుగుతోందని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. స్వచ్ఛమైన వాతావరణంలో దేశ నిర్మాణం జరగడం కోసమే భారత్ జోడో యాత్ర చేపట్టానని తెలిపారు. పార్లమెంటులో ఏ బిల్లు పెట్టినా టీఆర్ఎస్ మద్దతు కేంద్రానికి ఉంటోందని అన్నారు. రెండూ బొమ్మ-బొరుస వలే ఉన్నాయని విమర్శించారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో విచ్చలవిడిగా అవినీతి జరిగినా విచారణ జరిపించడంలో కేంద్రం వెనకడుగు వేసిందన్నారు. టీఆర్ఎస్ – బీజేపీ రాజకీయ పార్టీలు కాదు వ్యాపార సంస్థలని వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసిన రెండు పార్టీలు విమర్శలు, ప్రతివిమర్శలతో ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. నిరుద్యోగ సమస్య పెరుగుతూ తారాస్థాయికి చేరిందని, నోట్ల రద్దు జీఎస్టీ నిర్ణయాల వల్ల చిన్న- మధ్య తరహా వారి మీద ప్రభావం పడిందన్నారు. దేశప్రజలు మార్పు కోరుకుంటున్నారని, నిరుద్యోగం, ధరల పెంపుతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెట్రోల్, గ్యాస్ ధరలు పెరుగుదలకు ప్రధాని మోదీ ఏం సమాధానం చెబుతారని రాహుల్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, వాటిని ఎలుగెత్తి చాటడానికే భారత్ జోడో యాత్ర దోహదమవుతుందని చెప్పారు. మీ అభిమానం ప్రేమతోనే నడుస్తున్నా, ఇది సాధారణ యాత్ర కాదు అని రాహుల్ అన్నారు. ఆయన గురువారం తెలంగాణలో భారత్ జోడో యాత్ర చేపట్టారు. ఈ యాత్ర నారాయణపేట జిల్లా మక్తల్ నుంచి ప్రారంభమై కాచ్వార్, బొందలకుంట, జక్లేర్ గ్రామాల మీదుగా గుండిగండ్ల వరకు 26కిమీలు సాగింది. జనం సమస్యల్ని వింటూ, రైతులతో మాట్లాడుతూ రాహుల్ ముందుకు సాగారు. గుడిగండ్లలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో ముచ్చటించారు. గుండిగండ్ల సభకు ముందు ఒగ్గుడోలు కళాకారులతో కలిసి సందడి చేశారు. సరదాగా డోలు దరువు వేశారు. రాహుల్ వెంట టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ.ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ ఉన్నారు. కాగా, యాత్రలో భాగంగా తెలంగాణ రైతు సంఘాల ప్రతినిధులతో రాహుల్ భేటీ అయ్యారు. వివిధ అంశాలపై వారితో చర్చించారు. రైతు ఆత్మహత్యలు, కౌలు రైతుల పరిస్థితి, ధరణి భూ రికార్డులు, పంట బీమా వంటివాటి గురించి తెలుసుకున్నారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలనూ రాహుల్ పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ ద్వారా నష్టపోయిన నిజమైన భూమి హక్కు దారులకు న్యాయం చేస్తామని రైతు ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపడతామని రాహుల్ గాంధీ హామీనిచ్చారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం మరువలేనిది

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

విశాలాంధ్ర-నరసాపురం: పీఎం లంక అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం మరువలేనిదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గురువారం పీఎం లంక గ్రామంలో ఆమె వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రక్షిత మంచినీటి పథకం, గ్రామ సచివాలయ భవనం, డిజిటల్ భవనాల ప్రారంభోత్సవం, తీర గ్రామాలకు రక్షణగా గ్లోయిన్స్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నైపుణ్య శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చివరిగా 32 మంది లబ్ధిదారులకు ముద్ర రుణాల కింద రూ. 1.82 కోట్ల మేరకు చెక్కులను అందజేశారు. దత్తత గ్రామం పెదమైనవానిలంకలో నిర్వహించిన బహిరంగ సభలో సీతారామన్ మాట్లాడుతూ... తాను దిల్లీ నుంచి పీఎం లంకకు వస్తే సొంత ఇంటికి వచ్చినట్టు ఉందన్నారు. 2015లో ప్రధాన మంత్రి సన్సద్ ఆదర్శ గ్రామ యోజన పథకంలో పీఎం లంక గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు చెప్పారు. ఇక్కడ అధునాతన బయో డీ కంపోజింగ్ టాయిలెట్లు నిర్మించామని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సముద్రం గ్రామంలోకి రాకుండా నూతన టెక్నాలజీతో తీర గ్రామాలకు రక్షణగా గ్లోయిన్స్ నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టను చేపట్టనున్నామన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ పీఎం లంకను కేంద్ర ఆర్థికమంత్రి దత్తత తీసుకోవడం ఇక్కడి గ్రామస్తుల అదృష్టం అన్నారు. కిలో మీటరు పొడవున సాంకేతికతను ఉపయోగించి సముద్ర కోతను నివారించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాద్ రాజు, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ షేమ్ షేర్ సింగ్ రావత్, ఆర్థిక శాఖ సెక్రటరీ కె.వి.వి. సత్యనారాయణ, జిల్లా జాయింట్ కలెక్టర్ జె.వి.మురళి, నరసాపురం సబ్ కలెక్టర్ సూర్య తేజ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునకు హైకోర్టు నోటీసులు

విశాలాంధ్ర-అమరావతి: స్టార్‌మా టీవీలో ప్రసారం అవుతున్న బిగ్‌బాస్ షోపై ఏపీ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. విచారణ అనంతరం ఈ షోను నిర్వహిస్తున్న ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జునకు నోటీసులు జారీ చేసింది. నాగార్జునతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. బిగ్ బాస్ షోలో అశ్లీలత ఎక్కువగా ఉందని, కుటుంబంతో కలిసి చూసే పరిస్థితి లేనందున షోను రద్దు చేయాలంటూ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలైన సంగతి విదితమే. ఈ పిటిషన్ పై కోర్టుల్లో ఇప్పటికే రెండు దఫాలు విచారణ జరగ్గా, తాజాగా గురువారం జరిగిన విచారణలో ప్రతివాదులకు నోటీజులు జారీ అయ్యాయి. రెండు వారాల్లో నోటీసులకు సమాధానం ఇవ్వాలని కోర్టు... నాగార్జునతో పాటు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది.

ఆహ్వానం

విశాలాంధ్ర పూర్వ సంపాదకులు
సి. రాఘవాచారి తృతీయ వర్ధంతి

స్మారక సభ

28 అక్టోబరు 2022, సా.6 గంటలకు



నిర్వహణ
సి. రాఘవాచారి ట్రస్ట్

సభాధ్యక్షులు
ఆర్.వి. రామారావు
సంపాదకులు, విశాలాంధ్ర దినపత్రిక

స్మారకోపన్యాసం
ఆకార్ పటేల్
ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవ హక్కుల కార్యకర్త.

అంశం
2047 లో భారతదేశం:
అమృత కాలంలో ఏమి ఆశించాలి?

వేదిక
సిద్ధార్థ అకాడమీ, విజయవాడ

ఉపాహారం సాయంత్రం 5.30 గంటలకు
సకాలం లో సభకు హాజరుకావలసినదిగా కోరుతున్నాం

టీమిండియాకు రెండో విజయం

56 పరుగుల తేడాతో నెదర్లాండ్స్ చిత్తు

సిడ్నీ: ఆస్ట్రేలియాలో జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా వరుసగా రెండో విజయం సాధించింది. గురువారం సిడ్నీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై భారత్ 56 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో గ్రూప్-2లో భారత జట్టు 4 పాయింట్లతో మొదటి స్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా అన్ని రంగాల్లో రాణించింది. దీంతో భారీ విజయం దక్కింది. టీమిండియా విధించిన 180 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించలేక నెదర్లాండ్స్ చతికిలపడింది. నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి కేవలం 123 పరుగులు మాత్రమే చేసింది. ఆ జట్టులో బ్యాటర్లందరూ విఫలమయ్యారు. టిమ్ ప్రింగ్లే 20, కోలిన్ అకరమన్ 17 పరుగులు చేశారు. భారత బౌలర్లలో భువనేశ్వర్, అర్షదీప్, అక్షర్ పటేల్, అశ్విన్ రెండు వికెట్లు చొప్పున పడగొట్టారు. షమీకి ఒక వికెట్ దక్కింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా... నిర్ణీత 20 ఓవర్లలో 179/2 స్కోరు సాధించింది. కెప్టెన్ రోహిత్ శర్మ మళ్లీ ఫామ్ అందిపుచుకున్నాడు. 39 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 53 పరుగులు సాధించాడు. విరాట్ కోహ్లి 62 పరుగులు (44 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు), సూర్య కుమార్ యాదవ్ 51 పరుగుల (25 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్స్)లు చేసి అజేయంగా నిలిచారు. కాగా ఓపెనర్ కేఎల్ రాహుల్ (9) మరోసారి నిరాశపరిచాడు. కేఎల్ రాహుల్, రోహిత్ శర్మ ఇన్నింగ్స్ ఆరంభించగా మొదట్లో పరుగులు సాధించడం కష్టమైంది. 9 పరుగులు చేసిన రాహుల్ ఎల్బీగా వెనదిరిగాడు. ఆ తర్వాత విరాట్, రోహిత్ కూడా ఆచితూచి ఆడారు. 53 పరుగులు చేసి రోహిత్ కూడా ఔటయ్యాడు. కాగా సూర్యకుమార్ వచ్చీరాగానే భారీ షాట్లు ఆడాడు. తర్వాత కోహ్లి కూడా వేగం పెంచాడు. నెదర్లాండ్స్ బౌలర్లలో క్లాసెన్, మీకెరెన్ చెరో వికెట్ తీశారు. ఇంతకు ముందు నెదర్లాండ్స్ టీమిండియాతో ఏ టీ20 మ్యాచ్ ఆడలేదు. ఇప్పటివరకు 12 టెస్టు ఆడే దేశాలతో 36 టీ20 ఇంటర్నేషనల్స్ మాత్రమే ఆడింది. ఇందులో 21 మ్యాచ్‌లు ఐర్లాండ్, ఆఫ్ఘనిస్తాన్, జింబాబ్వే వంటి చిన్న జట్లపైనే ఉన్నాయి.

ఉత్కంఠపోరులో చతికిలపడ్డ పాక్

జింబాబ్వే చేతిలో ఘోర పరాజయం

పెర్త్: ఆస్ట్రేలియాలో జరుగుతున్న టీ20 వరల్డ్ కప్‌లో వరుస సంచనాలు చోటు చేసుకుంటున్నాయి. ఏమాత్రం గెలుపు అంచనాలు లేని కొత్త జట్లు కూడా ఈ మెగా టోర్నీలో బలమైన జట్లను మట్టి కరిపిస్తున్నాయి. ఈ దిశగా ఇప్పటికే వెస్టిండీస్ టోర్నీ నుంచి వైదొలగగా అదే ప్రమాదం మరికొన్ని కీలక జట్లకు పొంచి ఉంది. పెర్త్‌లో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టుకు ఘోర పరాభవం ఎదురైంది. అంతగా పటిష్ఠ లైనప్ లేని జింబాబ్వే చేతిలో పాకిస్తాన్ ఓడిపోయింది. అది కూడా ఒకే ఒక్క పరుగు తేడాతో పాక్ ఓడిపోవడం గమనార్హం. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన జింబాబ్వే జట్టు తొలుత బ్యాటింగ్ చేయాలని నిర్ణయించు కుంది. పదునైన బంతులను సంధించిన పాక్ బౌలర్లు జింబాబ్వేను భారీ స్కోరు చేయకుండా కట్టడి చేయగలిగారు. పాక్ బౌలర్ల ధాటికి పరుగులు చేసేందుకు నానా తంటాలు పడ్డ జింబాబ్వే బ్యాటర్లు... 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి కేవలం 130 పరుగులు మాత్రమే చేయ గలిగారు. జింబాబ్వే బ్యాటర్లలో టాప్ స్కోరర్ గా నిలిచిన సియాన్ విలియమ్స్ 31 పరుగులు మాత్రమే చేశాడు. క్రమంగా వికెట్లు పడుతున్న నేపథ్యంలో జింబాబ్వే బ్యాటర్లు వికెట్లను కాపాడుకునేందుకే ప్రాధాన్యం ఇచ్చినట్లుగా కనిపించింది. ఇక 131 పరుగుల విజయ లక్ష్యంతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన పాక్ ను కెప్టెన్ బాబర్ అజామ్ (4) మరోమారు నిరాశ పరిచాడు. నాలుగో ఓవర్ లోనే బాబర్ వికెట్ ను చేజార్చుకున్న పాక్ కు... ఐదో ఓవర్‌లో మరో ఓపెనర్ మొహ్మద్ రిజ్వాన్ (14) అవుట్ రూపంలో మరో షాక్ తగిలింది. అయితే ఫస్ట్ డౌన్‌లో వచ్చిన షాన్ మసూద్ (44) జట్టును ఆదుకునే యత్నం చేశాడు. అయితే భారీ షాట్లు ఆడేందుకు ఇబ్బంది పడ్డ మసూద్ 38 బంతుల్లో 3 ఫోర్ల సాయంతో 44 పరుగులు చేయగలిగాడు. అతడికి మిగిలిన బ్యాటర్ల నుంచి పెద్దగా సహకారం లభించలేదు.

చివరి బంతి...మూడు పరుగులు

ఇక చివరి దాకా పోరాటం చేసిన పాక్...తన ఇన్నింగ్స్‌లో చివరి బంతికి ఒక్క పరుగు చేయలేక ఓడిపోయింది. 20వ ఓవర్ చివరి బంతికి 3 పరుగులు తీస్తే పాక్ గెలుస్తుంది. అలా కాకుండా 2 పరుగులు తీసినా... మ్యాచ్ సూపర్ ఓవర్ దిశగా సాగుతుంది. అయితే పాక్ బౌలర్ షహీద్ అఫ్రీది బంతిని కొట్టి ఓ పరుగు తీశాడు. రెండో పరుగు తీయలేక రనౌట్ అయ్యాడు. ఫలితంగా 20 ఓవర్లలో పాక్ 8 వికెట్ల నష్టానికి కేవలం 129 పరుగులు మాత్రమే చేయగలిగింది. అంటే... సింగిల్ పరుగుతో జింబాబ్వే చేతిలో పాకిస్తాన్ మట్టి కరిచిందన్న మాట. ఆదివారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ పాక్ చివరి బంతికి ఓడిపోయిన సంగతి తెలిసిందే.

బీసీసీఐ సంచలన నిర్ణయం

పురుషులతో సమానంగా మహిళా క్రికెటర్లకు మ్యాచ్ ఫీజు

ముంబై: క్రికెట్ చరిత్రలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సరికొత్త నిర్ణయం తీసుకుంది. భారత క్రికెట్ వ్యవస్థలో ఎలాంటి వివక్షకు తావులేకుండా కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజు విషయంలో సమాన చెల్లింపు విధానం (పేఈక్విటీ పాలసీ) ప్రవేశపెట్టింది. ఇక పై భారత మహిళా క్రికెటర్లకు సైతం పురుష క్రికెటర్లతో సమానంగా మ్యాచ్ ఫీజులు ఇవ్వనుంది. క్రికెట్‌లో లింగ సమానత్వం తీసుకొచ్చే దిశగా ఈ కొత్త నిర్ణయం తీసుకన్నట్లు వెల్లడించింది. టెస్టు మ్యాచ్ ఫీజు రూ.15లక్షలు, వన్డేకు రూ.6లక్షలు, టీ-20కు రూ.3లక్షల చొప్పున చెల్లించనున్నట్లు ప్రకటించింది. మహిళా కికెటర్ల పట్ల తమకున్న నిబద్ధతకు ఇది నిదర్శమని పేర్కొంది. "లింగ వివక్షను అధిగమించే దిశగా బీసీసీఐ తొలి అడుగు వేసినందుకు నేను సంతోషిస్తున్నాను. కాంట్రాక్టు ఉన్న మహిళా క్రికెటర్ల కోసం మేము పే ఈక్విటీ విధానాన్ని అమలు చేస్తున్నాం. భారత క్రికెట్లో.. లింగ సమానత్వంలో కొత్త శకానికి నాంది పలికాం... ఇకపై పురుష, మహిళా క్రికెటర్లకు మ్యాచ్ ఫీజు ఒకే విధంగా ఉంటుంది. ఈ నిర్ణయం విషయంలో మద్దతునిచ్చిన అపెక్స్ కౌన్సిల్‌కు ధన్యవాదాలు" అని అని బీసీసీఐ కార్యదర్శి జైషా ట్వీట్ చేశారు.

మహిళా క్రికెటర్లకు పెద్ద విజయం: ఎన్‌సీడబ్ల్యూ

బీసీసీఐ నిర్ణయం... లింగ సమానత్వాన్ని సాధించడంలో గణనీయమైన పురోగతి అని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) పేర్కొంది. కాం ట్రాక్టులో ఉన్న భారత మహిళా క్రికెటర్లకు పేఈక్విటీ విధానాన్ని అమలు చేయాలన్న బీసీసీఐ నిర్ణయాన్ని స్వాగతించింది. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా క్రికె టర్లకు ఇది పెద్ద విజయం అని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రేఖా శర్మ అభివర్ణించారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ఈ నిర్ణయం యువ ప్రతిభావం తులను క్రీడల్లోకి ఆహ్వానించేందుకు స్ఫూర్తినిస్తుందని, బీసీసీఐ చూపిన నమూనాను ఇతర క్రీడా సంస్థలు అనుసరిస్తాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

The True Taste of Tradition

స్వగృహ ఫుడ్స్®

Estd : 1990

32 YEARS ANNIVERSARY

ప్రతి ఇంటా తెలుగు రుచుల మాధుర్యం, కమ్మదనం అందిస్తూ దేశవిదేశాలలో కస్టమర్ల అభిమానం చూరగొని నేటికి 32 వసంతాలు పూర్తిచేసుకున్న శుభసందర్భంగా శుభాభినందనలు

Sweets || Savouries || Chilly Powders || Pickles || Sugar Free || Dry Fruits

Swagruha® Foods

The Pioneers in Traditional Foods in A.P. & Telangana

VIJAYAWADA ❖ M.G.Road ☎ 0866-2475763
❖ Opp. Stella College ☎ 98855 45000
❖ Eluru Road ☎ 0866-6665763
GUNTUR ❖ 10/1, Arundelpet ☎ 0863-2235350

పైన తెలిపిన 4 అడ్రస్‌లో తప్పితే మాకు మరెక్కడా బ్రాంచీలు లేవు.

Customer Care : 99498 45000 | www.swagruhafoods.net

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.